MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 286 | పేజీలు : 8 | సోమవారం 5 అక్టోబర్ 2026 | వెల : 6-00

ఏపీలో 'తల్లికి వందనం'..

రెండో విడతకు రంగం సిద్ధం

- సుమారు 3.29 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.13,000 జమ
- ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదం.. సీఎంవో అనుమతి కోసం నిరీక్షణ
- వచ్చే వారం లేదా రెండు వారాల్లో నిధులు విడుదలయ్యే అవకాశం

అమరావతి, మహానగర్

ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పథకం రెండో విడత నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలపగా, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి తుది అనుమతి రావడమే మిగిలి ఉంది. సీఎంవో నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే నిధులను విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విడతలో భాగంగా అర్హులైన సుమారు 3.29 లక్షల మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు - మిగతా2లో

పేదలందరికీ పక్కా ఇళ్లు



తెనాలి, మహానగర్

రాష్ట్రంలోని ఇల్లు లేని పేదలందరికీ 2029 నాటికి పక్కా ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని బుర్రిపాలెంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారు కుటుంబంతో కలిసి భూమిపూజ చేశారు. రాష్ట్రానికి సాధారణ కోటా కింద 75 వేల ఇళ్లు - మిగతా2లో

- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- 9 లక్షల ఇళ్లతో పేదలకు పట్టాభిషేకం
- బుర్రిపాలెం నుంచి 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
- మరో 6 లక్షల ఇళ్ల మంజూరుకు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ హామీ



నేడు కడప జిల్లాలో చంద్రబాబు, పవన్ పర్యటన


- 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్) పథకానికి శ్రీకారం
- రూ.30,156 కోట్ల వ్యయంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా 2
- రాష్ట్రవ్యాప్తంగా 27.36 లక్షల కొత్త కుళాయి కనెక్షన్లు ఇవ్వడమే లక్ష్యం
- ప్రొద్దుటూరులో పథకం ప్రారంభించి, బహిరంగ సభలో ప్రసంగించనున్న నేతలు

ఏపీ ప్రజల అన్ని ఆశలు నెరవేర్చడం చంద్రబాబు ద్వారానే సాధ్యం

- 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన.. హాజరైన కేంద్రమంత్రి శివరాజ్ సింగ్, సీఎం చంద్రబాబు
- సీఎం చంద్రబాబు కోరిక మేరకు మరిన్ని ఇళ్లు ఇస్తామని శివరాజ్ సింగ్ హామీ
- జగన్ పాలనలో ఏపీ నాశనమైందని, పేదల ఇళ్లను అడ్డుకున్నారని విమర్శ
- చంద్రబాబు విజన్‌తో ఏపీ దేశంలోనే నంబర్ వన్ అవుతుందని ఉద్ఘాటన

2





ఏపీ ప్రజల అన్ని ఆశలు నెరవేర్చడం

చంద్రబాబు ద్వారానే సాధ్యం

ఆంధ్రప్రదేశ్ ప్రజల సమస్త ఆకాంక్షలు నెరవేర్చగల సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రమే ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. చంద్రబాబు ఒక డైనమిక్, డెడికేటెడ్, డెసిసివ్ నాయకుడని, ఆయన విజన్‌కు తాను సెల్యూట్ చేస్తున్నానని కొనియాడారు. తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో జరిగిన 3 లక్షల ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా అవతరించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజల కలలను సాకారం చేయడానికి చంద్రబాబు నాయకత్వం అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.



టెక్నాలజీతో రాష్ట్రాభివృద్ధికి బాటలు

భవిష్యత్తులో దేశానికి అతిపెద్ద శక్తి టెక్నాలజీయేనని చంద్రబాబు ఎప్పుడో గుర్తించారని శివరాజ్ సింగ్ గుర్తుచేశారు. "ఆయన దూరదృష్టితోనే ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రాన్ని గ్లోబల్ ఐటీ హబ్‌గా ప్రపంచానికి పరిచయం చేశారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ఏఐ, డేటా సెంటర్లు, క్వాంటం టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి రంగాల్లో ఏపీలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నారు. అమరావతి అభివృద్ధిపై ఆయన విజన్ చూసి నేను ఆశ్చర్యపోయాను. ఆయన నిబద్ధత, కఠోర శ్రమతో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఐకాన్‌గా నిలుస్తుంది" అని చౌహాన్ పేర్కొన్నారు.

జగన్ పాలనలో సర్వనాశనం

గత ఐదేళ్లలో జగన్ తన విధ్వంసకర వైఖరితో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని చౌహాన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రధాని నరేంద్ర మోదీ పేదల ఇళ్ల కోసం నిధులు పంపితే, జగన్ ప్రభుత్వం తన వాటా ఇవ్వకుండా ఆ పథకాన్ని నీరుగార్చింది. పేదల సొంతింటి కలను చిదిమేసింది. కేంద్రం పంపిన నిధులను దారి మళ్లించి పాపం చేసింది. జగన్‌ను ఏపీ ప్రజలు ఎప్పటికీ క్షమించరు" అని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వం సరిగ్గా పనిచేసి ఉంటే, ఈపాటికే పేదలందరికీ ఇళ్లు ఉండేవని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్రాన్ని రాజధాని లేకుండా వదిలేస్తే, జగన్ మూడు రాజధానుల ఆటతో గందరగోళం సృష్టించారని దుయ్యబట్టారు.

పేదలందరికీ పక్కా ఇళ్లు.. కేంద్రం భరోసా

చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక పేదలందరికీ ఇళ్లు కట్టించాలని సంకల్పించారని శివరాజ్ సింగ్ తెలిపారు. "కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రాష్ట్రానికి 76,000 ఇళ్లు మాత్రమే వస్తాయని అధికారులు చెప్పారు. కానీ చంద్రబాబు గారు అందరికీ ఇళ్లు కావాలని, ఇంకా ఎక్కువ కేటాయించాలని ప్రధాని మోదీని కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు తొలి విడతగా 3 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. ఇవాళ బాబు గారు ఇవి కూడా చాలవు, మరో 6 లక్షల ఇళ్లు కావాలని అడిగారు. తప్పకుండా ఇస్తాం. ఈ 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక, మళ్లీ 3 లక్షలు, ఆ తర్వాత మరో 3 లక్షలు ఇచ్చి రాష్ట్రంలోని ప్రతి పేదవాడి సొంతింటి కలను ప్రధాని మోదీ ఆశీస్సులతో, చంద్రబాబు నాయకత్వంలో నెరవేరుస్తాం" అని హామీ ఇచ్చారు. బుర్రిపాలెంలో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్లు నిర్మించడం దేశానికే ఆదర్శమని, ఇది సమయాన్ని, ఖర్చును తగ్గిస్తుందని ప్రశంసించారు.

మోదీ-బాబు నాయకత్వంలో 360 డిగ్రీల అభివృద్ధి

ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ, ఇక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చేస్తున్నారని చౌహాన్ అన్నారు. "మోదీ, బాబు అంటే ఒకటి ం ఒకటి = రెండు కాదు.. ఒకటి ం ఒకటి = పదకొండు. వారితో పవన్ కల్యాణ్ కూడా తోడయ్యారు. ఈ ముగ్గురూ కలిసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తారు. అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంటులో చట్టం చేశాం. రాష్ట్రానికి రూ. 15,000 కోట్ల ఆర్థిక సహాయం అందించాం. జగన్ సర్కారు పక్కన పెట్టిన పోలవరం ప్రాజెక్టును 100 శాతం కేంద్ర నిధులతో పూర్తి చేస్తాం" అని స్పష్టం చేశారు.

మహిళలు, రైతుల సంక్షేమానికి పెద్దపీట

రాష్ట్రంలోని ఏ సోదరి పేదరికంలో ఉండకూడదనే లక్ష్యంతో 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 23 లక్షలుగా ఉన్న లఖ్‌పతి దీదీల సంఖ్యను 60 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చారు. మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే 'సరస్ మేళా'ను తొలిసారిగా ఢిల్లీ నుంచి బయటకు తీసుకొచ్చి, అక్టోబర్ 15న విజయవాడలో నిర్వహిస్తున్నామని ప్రకటించారు. ఇది మహిళల పాలిట కుంభమేళా అవుతుందన్నారు.

రైతుల కోసం కేంద్రం ఇస్తున్న రూ. 6,000కు అదనంగా, చంద్రబాబు 'అన్నదాత సుఖీభవ' కింద మరో రూ. 14,000 కలిపి మొత్తం రూ. 20,000 అందించి రైతులకు అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రాన్ని హార్టికల్చర్ హబ్‌గా మార్చి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని భరోసా ఇచ్చారు.

"చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఇక సర్వైవింగ్ స్టేట్ కాదు, షైనింగ్ స్టేట్‌గా మారింది. ఆస్పిరేషనల్ ఆంధ్ర, యాంబిషియస్ ఆంధ్ర, ఆసమ్ ఆంధ్రగా రూపుదిద్దుకుంటోంది. ప్రతి ఒక్కరి కలలను నెరవేర్చే బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుంది" అని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తన ప్రసంగాన్ని ముగించారు.

మధ్యప్రదేశ్‌కే కాదు.. ఆయన ఆంధ్రప్రదేశ్‌కు కూడా మామ

రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చే దిశగా ఎన్డీయే ప్రభుత్వం చారిత్రక ముందడుగు వేసింది. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన – గ్రామీణ్ (గ్రామీణ్–+)' కింద మూడు లక్షల ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడిన చంద్రబాబు, 2029 నాటికి రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. పేదవాడికి సొంత ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదని, అదొక భద్రత, భవిష్యత్తుకు భరోసా అని ఆయన అభివర్ణించారు.



కేంద్రం అండ.. 9 లక్షల ఇళ్ల లక్ష్యం

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మధ్యప్రదేశ్ కే కాదు "ఆంధ్రప్రదేశ్‌కు కూడా మామ" అని ఆప్యాయంగా సంబోధించిన చంద్రబాబు, ఆయన సహకారంతో రాష్ట్రానికి భారీగా గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. తాను అడిగిన వెంటనే 3 లక్షల ఇళ్లను మంజూరు చేశారని, మరో మూడు, నాలుగు నెలల్లో ఇంకో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో 3 లక్షల ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారని, మొత్తం 9 లక్షల ఇళ్లను రాష్ట్రానికి అందించనున్నారని వెల్లడించారు.

మధ్యప్రదేశ్‌లో నదుల అనుసంధానం వంటి గొప్ప పనులతో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రజల గుండెల్లో నిలిచారని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 4 కోట్లకు పైగా పక్కా ఇళ్లను నిర్మించిందని గుర్తుచేశారు.

దేశంలోనే తొలిసారిగా 3ఱ ప్రింటింగ్ టెక్నాలజీ

ఈ కార్యక్రమంలో భాగంగా, దేశంలోనే తొలిసారిగా పేదల గృహ నిర్మాణంలో "3ఱ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ"ని వినియోగిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రయోగాత్మకంగా బుర్రిపాలెంలో 170 ఇళ్లను ఈ నూతన సాంకేతికతతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ టెక్నాలజీతో నిర్మించిన ఇళ్లలో బయటి వాతావరణంతో పోలిస్తే లోపల 8 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, తద్వారా ఏసీ అవసరం లేకుండానే చల్లదనం లభిస్తుందని శాస్త్రవేత్తలు చెప్పినట్లు వివరించారు.

కేవలం మూడు నెలల్లోనే ఇంటి నిర్మాణం పూర్తికావడం, వర్షాలకు తేమ చేరకపోవడం, లీకేజీలు ఉండకపోవడం వంటి ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా మరో 5,000 ఇళ్లు ఇదే విధానంలో నిర్మించి, బుర్రిపాలెం ఆదర్శాన్ని జాతీయ విధానంగా మార్చేందుకు కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని చంద్రబాబు ఆరోపించారు. పేదల కోసం గతంలో తమ ప్రభుత్వం మంజూరు చేసిన 17 లక్షల ఇళ్లలో 6 లక్షల ఇళ్లను రద్దు చేశారని, గృహ నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని విమర్శించారు. చెరువులు, కొండలు, గుట్టల్లో నివాసయోగ్యం కాని స్థలాలను కేటాయించడంతో 4 లక్షల మంది లబ్ధిదారులు వాటిని తిరస్కరించారని గుర్తుచేశారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, వివాదాస్పద ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, పట్టాదారు పాసుపుస్తకాలపై గత ముఖ్యమంత్రి ఫొటోను తొలగించి రాజముద్రతో కొత్త పట్టాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మార్చి నాటికి భూముల రీసర్వే పూర్తి చేసి, భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి, సంక్షేమమే అజెండా

కూటమి ప్రభుత్వానికి 2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా రాత్రింబవళ్లు పనిచేస్తామని చంద్రబాబు అన్నారు. సూపర్ సిక్స్ పథకాలైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు ఏటా రూ. 20,000 ఆర్థిక సాయం వంటివి ఇప్పటికే అమలు చేస్తున్నామని తెలిపారు. వచ్చే మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి, ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాను ఆదుకున్నామని, ఈ ఏడాది కూడా 60 టీఎంసీల గోదావరి జలాలను తరలించామని వివరించారు.

అమరావతి.. భవిష్యత్ మెగా సిటీ

అమరావతి కేవలం రాజధాని కాదని, అదొక మెగా సిటీగా రూపుదిద్దుకుంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి ప్రాంతాలు కలిసిపోయి అంతర్జాతీయ స్థాయి నగరం ఆవిర్భవిస్తుందన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 3న అమరావతిలో "క్వాంటం వ్యాలీ"కి శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఇతర కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పేదలందరికీ పక్కా ఇళ్లు

-మొదటిపేజీ తరువాయి

మాత్రమే మంజూరయ్యాయని, ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడంతో కేంద్రం 3 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని చంద్రబాబు తెలిపారు. ప్రస్తుత 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోగా మరో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో 3 లక్షల ఇళ్లు మంజూరు చేసేందుకు కేంద్ర మంత్రి అంగీకరించారని, మొత్తంగా 9 లక్షల ఇళ్లు రాష్ట్రానికి అందనున్నాయని చెప్పారు. బుర్రిపాలెంలో రూ.14 కోట్లతో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో 177 ఇళ్ల నిర్మాణాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టినట్లు తెలిపారు. ఈ సాంకేతికతతో తక్కువ సమయంలో, తక్కువ వ్యయంతో పటిష్టమైన ఇళ్లను నిర్మించవచ్చని అధికారులు వివరించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 5.5 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించినట్లు సీఎం తెలిపారు. పేదలకు పట్టాభిషేకంలో భాగంగా రూ.52 వేల కోట్ల విలువైన నివాస స్థలాలను అందించామని చెప్పారు. గత పాలనలో 6 లక్షల ఇళ్లను రద్దు చేశారని, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో స్థలాలు ఇచ్చారని విమర్శించారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయడంతో పాటు వచ్చే ఐదేళ్లలో రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణాభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ షైనింగ్ ఆంధ్రా, అడ్వాన్స్‌డ్ ఆంధ్రా, అచీవింగ్ ఆంధ్రాగా మారుతోందని కొనియాడారు. 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని అన్నారు. ప్రస్తుత 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోగా మరో 3 లక్షలు, ఆ తర్వాత మరో 3 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. 3డీ సాంకేతికతతో కేవలం 10 రోజుల్లో ఇంటి నిర్మాణం పూర్తిచేసే అవకాశం ఉందని సీబీఆర్ఐ అధికారులు వివరించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఏపీలో 'తల్లికి వందనం'..

రెండో విడతకు రంగం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

ఖాతాల్లో రూ. 13,000 చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ జాబితాలో ఉన్నారు. వీరితో పాటు, గతంలో సాంకేతిక కారణాలు, ఇతర మార్పుల వల్ల డబ్బులు అందని వారికి కూడా ఈ విడతలో నిధులు అందించనున్నారు. అధికారులు ఇప్పటికే లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి తుది జాబితాను సిద్ధం చేశారు. నిధుల విడుదలకు సంబంధించిన ఫైల్‌కు ఆర్థిక శాఖ కూడా ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం ఈ ఫైల్ సీఎంవో వద్ద తుది ఆమోదం కోసం ఉంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అనుమతి లభించిన వెంటనే, ఒకటి రెండు వారాల్లో లేదా వచ్చే వారంలోనే నిధులు జమ అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ అయ్యిందా లేదా, ఈ-కేవైసీ పూర్తయిందా అనే వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థి, తల్లి ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వంటివి సరిగ్గా ఉంటే నిధులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సకాలంలో జమ అవుతాయని వారు స్పష్టం చేశారు.

నేడు కడప జిల్లాలో చంద్రబాబు, పవన్ పర్యటన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్) పథకానికి సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రేపు (అక్టోబరు 5) కడప జిల్లాలోని ప్రొద్దుటూరులో పర్యటించనున్నారు. వీరిద్దరూ కలిసి ఈ భారీ తాగునీటి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి, జాతికి అంకితం చేస్తారు. అధికారిక షెడ్యూల్ ప్రకారం, సోమవారం ఉదయం 11:20 గంటలకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్‌కు సంబంధించిన ప్రత్యేక శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విధానాలు, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై వారు ప్రజలకు వివరించే అవకాశం ఉంది. నేతల పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందుకోసం సుమారు రూ.30,156 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 27.36 లక్షల కొత్త గృహ కుళాయి కనెక్షన్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ముఖ్యంగా, తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం నడిచివెళ్లే గ్రామీణ మహిళల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ పథకం యొక్క ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం స్పష్టం చేసింది. టీడీపీ–జనసేన కూటమి ప్రభుత్వంలో ఇది ఒక కీలకమైన గ్రామీణ సంక్షేమ కార్యక్రమంగా నిలవనుంది

అది ఆగ్రహం కాదు, ఉత్సాహం..

జైరాం రమేశ్‌కు చంద్రబాబు, లోకేశ్ కౌంటర్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ చేసిన ఓ సోషల్ మీడియా పోస్టుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. వాస్తవాలు తెలుసుకోకుండా, తప్పుడు సమాచారం ఆధారంగా వ్యాఖ్యలు చేయడం ఏంటని వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అది ప్రజాగ్రహం కాదని, ప్రజల ఉత్సాహం అని స్పష్టం చేస్తూ ఘాటుగా బదులిచ్చారు. ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లెలో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' పనుల ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతుండగా, సభలో ఉన్న కొందరు యువకులు కేకలు, అరుపులతో కాస్త గందరగోళం సృష్టించారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని, వారిని శాంతపరిచి ప్రసంగం సజావుగా సాగేలా చూశారు. అయితే, ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సులేమాన్ ఖాన్ అనే నెటిజన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. 'మొదట ఉద్యోగాలు ఇవ్వండి' అంటూ సభలోని వారు నినాదాలు చేశారని తప్పుడు సమాచారాన్ని జోడించాడు. ఈ పోస్టును జైరాం రమేశ్ రీపోస్ట్ చేస్తూ, "ప్రజల్లో ఎంత ఆగ్రహం ఉందో ఆర్థిక మంత్రి స్వయంగా చూస్తున్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ప్రజలను నిశ్శబ్దంగా మార్చాల్సి వచ్చింది" అని వ్యాఖ్యానించారు.

చంద్రబాబు, లోకేశ్ తీవ్ర స్పందన

జైరాం రమేశ్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "జైరాం జీ, జరిగిన దానికి మీ వ్యాఖ్యానానికి ఏమాత్రం సంబంధం లేదు. మీరు దేన్నైతే ప్రజాగ్రహం అని తప్పుగా చిత్రీకరించాలని చూస్తున్నారో, అది వాస్తవానికి ప్రజల నుంచి వచ్చిన అపూర్వమైన, ఉత్సాహపూరితమైన స్పందన. సభలో వారి ఉత్సాహం అధికంగా ఉండటంతో, కార్యక్రమం సజావుగా సాగేందుకు నేను జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ప్రజల ఉత్సాహాన్ని ఆగ్రహంగా పొరబడటం చూస్తుంటే, ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలకు మీరు ఎంత దూరంగా ఉన్నారో అర్థమవుతోంది. రాజకీయ ప్రేరేపిత సోషల్ మీడియా కథనాలతో వాస్తవాలను మార్చలేరు" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

మంత్రి నారా లోకేశ్ కూడా ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందించారు. "ఫేక్ న్యూస్‌ను తయారుచేసేది ఇలాగే. సీనియర్ కాంగ్రెస్ నేతలు వాస్తవాలను కూడా సరిచూసుకోకుండా దాన్ని ప్రచారం చేస్తారు. ఉద్యోగాలు కావాలంటూ ఆర్థిక మంత్రి ప్రసంగానికి స్థానిక యువత అంతరాయం కలిగించారన్నది పూర్తిగా అవాస్తవం. ప్రజలతో సాధారణ సంభాషణను ఉద్దేశపూర్వకంగా కత్తిరించి, వక్రీకరించి కట్టుకథ అల్లుతున్నారు. జైరాం రమేశ్ గారూ, మీలాంటి సీనియర్ నేత ట్వీట్ చేసే ముందు వాస్తవాలు సరిచూసుకోవాలి. ఉద్దేశపూర్వక తప్పుడు సమాచారం తగదు. ఆ అబద్ధాన్ని తొలగించండి" అని లోకేశ్ డిమాండ్ చేశారు.

టైటిల్ నిలబెట్టుకున్న తమిళనాడు.. బాలుర విభాగం విజేత రాజస్థాన్





ఘనంగా ముగిసిన 51వ సబ్ జూనియర్ జాతీయ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్

ఫైనల్లో మహారాష్ట్రపై 65-55తో తమిళనాడు విజయం

బాలుర విభాగంలో యూపీని 77-56తో చిత్తు చేసిన రాజస్థాన్

బాలికల కాంస్యం యూపీకి.. బాలుర కాంస్యం హర్యానాకు

విజయవాడ స్పోర్ట్స్, మహానగర్

నగరంలోని ఆర్టీసీ కాలనీలోని మారిస్ స్టెల్లా కాలేజ్ ఇండోర్ స్టేడియంలో ఎనిమిది రోజులుగా సాగిన 51వ సబ్ జూనియర్ జాతీయ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తమిళనాడు బాలికలు టైటిల్‌ను నిలబెట్టుకోగా, రాజస్థాన్ బాలుర విభాగంలో కొత్త చాంపియన్‌గా అవతరించింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి యువ బాస్కెట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలను బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎఫ్ఐ), బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) సంయుక్తంగా నిర్వహించాయి. ఆదివారం జరిగిన బాలికల ఫైనల్లో తమిళనాడు 65-55తో మహారాష్ట్రను ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. తొలి రెండు క్వార్టర్లలో ఇరు జట్లు హోరాహోరీగా తలపడటంతో తొలి అర్ధభాగం ముగిసే సమయానికి తమిళనాడు 33-31తో స్వల్ప ఆధిక్యంలో నిలిచింది. చివరి రెండు క్వార్టర్లలో మెరుగైన వ్యూహంతో ఆధిపత్యం ప్రదర్శించిన తమిళనాడు విజయం సాధించింది. ధన్య ఎం. 19, వి. అన్షిక 13 పాయింట్లతో రాణించగా, మహారాష్ట్ర తరఫున మైత్రి షా 13 పాయింట్లు సాధించింది. బాలుర ఫైనల్లో రాజస్థాన్ 77-56తో డిఫెండింగ్ చాంపియన్ ఉత్తరప్రదేశ్‌ను ఓడించింది. ఆరంభం నుంచే వేగంగా ఆడిన రాజస్థాన్ తొలి అర్ధభాగంలోనే 44-25తో భారీ ఆధిక్యం సాధించింది. రోనిత్ ధంకా 19, దక్ష్ చౌదరి 18 పాయింట్లతో రాజస్థాన్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఉత్తరప్రదేశ్ తరఫున సాహిల్ కుమార్ 22, వంశ్ తోమర్ 10 పాయింట్లు సాధించారు. బాలికల కాంస్య పతక పోరులో ఉత్తరప్రదేశ్ 65-49తో కర్ణాటకను ఓడించింది. ఏంజెల్ మాలిక్ 25, తేజస్వి కర్ష్నా 9 పాయింట్లతో యూపీ విజయంలో రాణించారు. బాలుర కాంస్య పోరులో హర్యానా 60-54తో మహారాష్ట్రపై విజయం సాధించింది. హర్యానా తరఫున హర్ష్ రాథీ 16, కేశవ్ కౌశిక్ 11 పాయింట్లు నమోదు చేశారు. టోర్నమెంట్ అత్యుత్తమ క్రీడాకారులుగా బాలికల విభాగంలో తమిళనాడుకు చెందిన ధన్య ఎం., బాలుర విభాగంలో రాజస్థాన్‌కు చెందిన రజత్ వ్యాస్ ఎంపికయ్యారు. ఉత్తమ త్రీపాయింట్ షూటర్లుగా మహారాష్ట్రకు చెందిన నేత్ర దామ్మే, ఉత్తరప్రదేశ్‌కు చెందిన శరద్ కుమార్ నిలిచారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.3 లక్షలు, రూ.2 లక్షలు, రూ.లక్ష చొప్పున నగదు బహుమతులు అందించారు. టోర్నమెంట్ ఎంవీపీలకు రూ.50 వేలు, ఉత్తమ త్రీపాయింట్ షూటర్లకు రూ.25 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో ఎంపీ జీఎం హరీశ్ బాలయోగి, మాజీ ఎంపీ, తెలంగాణ మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, శాప్ వీసీ, ఎండీ ఎస్. భారతి, ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ సౌమ్య మిశ్రా, విజయవాడ మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర, నిర్వాహకులు తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

జాతీయ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఏపీ జట్లు

శ్రీనగర్‌లో ఈ నెల 5 నుంచి 10 వరకు 21వ జాతీయ ఛాంపియన్‌షిప్

బాల బాలికల విభాగాల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం



విజయవాడ స్పోర్ట్స్, మహానగర్

జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ఈ నెల 5 నుంచి 10 వరకు నిర్వహించనున్న 21వ జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ బాలుర, బాలికల జట్లు పయనమయ్యాయి. ఆరు రోజులపాటు జరిగే ఈ టోర్నీలో రాష్ట్ర జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి. దిలీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులకు టీడీపీ నాయకుడు కోనేరు రాజేష్ చేతుల మీదుగా క్రీడా దుస్తులను అందజేశారు. రాష్ట్ర చైర్మన్ డా. దారం నవీన్ కుమార్, అధ్యక్షుడు వి. శ్రీనుబాబు, కోశాధికారి బి. నీరజ తదితరులు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. బాలుర జట్టులో పీ.వి. చిన్నాస్, ఎం. రేవంత్, వి. జయరామ్ సంజయ్ (ఎన్టీఆర్ జిల్లా), ఎస్. ఈశ్వర హితేష్, ఎన్. అర్జున్ సాయి, ఎస్.కె. తంజీల్, ఎస్.కె. గౌస్ మొహిద్దీన్ (కృష్ణా జిల్లా), సిహెచ్.ఎల్. వెంకట సందీప్ (కాకినాడ) ఎంపికయ్యారు. బాలికల జట్టులో ఏ. శ్రీ వైశాలి (ఎన్టీఆర్ జిల్లా), ఏ. దివ్య జ్యోతి, కె. భాగ్యశ్రీ, బి. తేజశ్రీ (కాకినాడ), ఆర్. హాసిని (గుంటూరు), డి. అరిఫా (అనంతపురం), ఎం. మోక్ష (కడప), జె. ఇషితా (విశాఖపట్నం) చోటు దక్కించుకున్నారు.

కాపు ఉద్యమ నేత గాళ్లకు ఘన నివాళి

దశదిన కర్మ సందర్భంగా ఘనంగా సంస్మరణ సభ

కాపు హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని శ్లాఘించిన పలువురు ప్రముఖులు

విజయవాడ, మహానగర్

కాపు సామాజిక వర్గ అభివృద్ధి కోసం కాపు ఉద్యమనేత, కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం చేసిన కృషి ఆదర్శప్రాయమని పలువురు కాపు సామాజిక వర్గ ప్రముఖులు కొనియాడారు. నగరంలోని 'ఎ ప్లస్' కల్యాణ మండపంలో గాళ్ల సుబ్రహ్మణ్యం దశదిన కర్మ సందర్భంగా ఆదివారం సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాపు సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు, మిత్రులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కాపు సామాజిక వర్గ హక్కుల కోసం, ముఖ్యంగా కాపు రిజర్వేషన్ల సాధనకు గాళ్ల సుబ్రహ్మణ్యం చేసిన నిరంతర పోరాటాన్ని, ఆయన నిస్వార్థ సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన చూపిన ఉద్యమ స్ఫూర్తి, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సమాజ హితం కోసం ఆయన పడిన తపన రాబోయే తరాలకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తుందని కొనియాడారు. సంస్మరణ సభలో శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, ప్రముఖ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్, కొలనుకొండ శివాజీ, అంబటి రాంబాబు, వంగవీటి ఆశాకిరణ్, సామినేని ప్రసాద్, గంధం కరుణాకర్ నాయుడు, మా ఆర్ట్స్ బాబి, దాసరి రాము, అల్లంపూర్ణ చంద్రరావు, చిరంజీవి ఫాన్స్ కృష్ణ ప్రసాద్, కూనపరెడ్డి రమేష్, కూనిశెట్టి వెంకటేశ్వరరావు, రమేష్ బాబి, కొప్పురావూరి సీమ, గాళ్ల సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు, కాపునాడు ప్రతినిధులు, సామాజిక వర్గ ప్రముఖులు పాల్గొన్నారు.

నివేదిత గురుకులంలో సుజనా ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరం



ఉంగుటూరు, మహానగర్

మండల కేంద్రంలోని నివేదిత గురుకులంలో విద్యార్థినుల కోసం సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ జయరామ విజ్ఞాన విహార యాజమాన్యం విజ్ఞప్తి మేరకు ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో దంత, కంటి పరీక్షలతో పాటు జనరల్ ఫిజీషియన్లు, హెల్ప్ హాస్పిటల్స్ ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రాగా, ఆమె బృందం పాల్గొని విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. విద్యార్థినులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుని అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి వారి సూచనలు పాటించాలని సుజనా ఫౌండేషన్ సిబ్బంది విద్యార్థినులకు సూచించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన శిబిరంలో 120 మంది విద్యార్థినులకు నిపుణులైన వైద్యుల బృందం ప్రత్యేక శ్రద్ధతో వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేసింది. సిద్ధార్థ డెంటల్ హాస్పిటల్స్ డాక్టర్ అజయ్ బెనర్జీ బృందం, శంకర నేత్ర చికిత్సాలయం వైద్య సిబ్బంది, సుజనా ఫౌండేషన్ సిబ్బంది శిబిరంలో సేవలు అందించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించనున్న అధికారులు

కలెక్టరేట్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహణ

విజయవాడ, మహానగర్



ప్రజా సమస్యలకు వేగవంతమైన, పారదర్శకమైన పరిష్కారం అందించేందుకు ఈ నెల 5న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాస్థాయి వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీల్లో పేరు, పూర్తి చిరునామా, మొబైల్ నంబర్‌తో పాటు సమస్యకు సంబంధించిన సమగ్ర వివరాలను స్పష్టంగా పొందుపరచాలని సూచించారు. సంబంధిత ఆధార పత్రాలు, ఇతర డాక్యుమెంట్లను అర్జీతో పాటు జతచేయాలని తెలిపారు. ఇప్పటికే అదే సమస్యపై ఫిర్యాదు చేసిన వారు పాత అర్జీ లేదా ఫిర్యాదు రశీదును వెంట తీసుకురావాలని సూచించారు. దీనివల్ల గత ఫిర్యాదు వివరాలను పరిశీలించి తదుపరి చర్యలను వేగంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కలెక్టరేట్‌కు వ్యక్తిగతంగా హాజరై అర్జీ సమర్పించలేని ప్రజలు 1100 టోల్‌ఫ్రీ కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని చెప్పారు. అలాగే మీకోసం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. డివిజన్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోనూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే అవకాశం ఉందని, ప్రజలు తమకు సమీపంలోని సంబంధిత కార్యాలయాలను సంప్రదించి సమస్యలను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఈ నెల 6, 7 తేదీల్లో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలి పర్యటన

విజయవాడ, మహానగర్



రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు కె.జి. పద్మలత ఈ నెల 6, 7 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో బాలల హక్కుల చట్టాల అమలు, సంక్షేమ పథకాల తీరును పరిశీలించేందుకు ఆమె ఈ పర్యటన చేపట్టనున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి షేక్ రుక్సానా సుల్తానా బేగం ఆదివారం తెలిపారు. ఈ నెల 6న అంగన్‌వాడీ కేంద్రాలు, బాలల సంరక్షణ కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను కమిషన్ సభ్యురాలు సందర్శించి పరిశీలించనున్నారు. అనంతరం ప్రభుత్వ బాలుర వసతి గృహాలను తనిఖీ చేస్తారు. ఈ నెల 7న సంరక్షణ కేంద్రాల సిబ్బందితో బాలల హక్కులు, అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తారు. కమిషన్ సభ్యురాలి పర్యటనలో ఎలాంటి సమన్వయ లోపాలు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం సంబంధిత అధికారులను ఆదేశించింది. కేటాయించిన విధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

మహానగర్

కాలుష్యంలో ఢిల్లీ

ఢిల్లీలో ఈ సమయంలో సర్వసాధారణంగా ఉండాల్సిన ఉష్ణోగ్రతలు ఇప్పుడు బాగా తగ్గిపోయాయంటే, అదేమీ సంతోషించాల్సింది కాదు. 2008 తరువాత సెప్టెంబర్ నెలాఖరులో అత్యల్ప ఉష్ణోగ్రత రికార్డు కావడమన్నది నగరం చల్లబడిందని కాక, దేశ రాజధాని మళ్ళీ కష్టకాలంలోకి జారుకుంటోందన్న హెచ్చరిక. వాయు కాలుష్యంతో ఈ శీతాకాలంలో నగరవాసులు మరోమారు నరకం అనుభవించబోతున్నారని అర్థం. ప్రతి ఏటా ఢిల్లీ ప్రభుత్వం కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు కొన్ని ప్రకటిస్తుంది. శీతాకాలంలో పాలకులకు ఇది ఒక క్రమం తప్పలేని ఎజెండా. సోమవారం కూడా మళ్ళీ అదే జరిగింది. పలురకాల నిర్మాణాలమీద నిషేధం విధించారు, కార్యాలయ వేళల్లో మార్పుచేర్పులు ప్రకటించారు, ఆఫీసులకు వచ్చిపనిచేసే సిబ్బందిలో సగంమందిని ఇంటినుంచి పనిచేయాలంటున్నారు, నగరం బయట రిజిస్టరయిన వాహనాల నగర ప్రవేశాన్ని అడ్డుకుంటున్నారు, పార్కింగ్ చార్జీలు కూడా పెంచారు. ఈ జాబితాలో ఏవి ఎప్పటినుంచి అమల్లోకి రాబోతున్నాయన్నది అటుంచితే, శీతాకాలం ప్రవేశం వరకూ ఇష్టారాజ్యంగా సాగినవన్నీ, ఇప్పుడు అత్యంత ప్రమాదకరమైనవిగా తోచడం, పరిణమించడం విశేషం. ఇప్పటిచలి తాత్కాలికమేనని, అల్పపీడన ప్రభావం తగ్గితే పరిస్థితిలో కాస్తంత మార్పు రావచ్చని అంటున్నప్పటికీ, కాస్తంత అటూఇటూగా ఈ సంక్షోభం ఏటా ఎదుర్కోక తప్పనిదే. నిర్మాణాలు, కూల్చివేతలమీద పూర్తిస్థాయి నిషేధాన్ని అటుంచితే, ఇప్పటికే అమలులో ఉన్న 'నో ఫ్యూయల్--నో పీయూసీ' విధానాన్ని మరింత కఠినంగా అమలు చేస్తారట. ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ రికగ్నేషన్ కెమెరాలు ఉన్న ఐదువందల పెట్రోల్ బంకుల్లో పాతవాహనాలమీద విరుచుకుపడతారట. రెండున్నర లక్షలవాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయబోతున్నట్టు, ఉన్న ఐదువేల ఎలక్ట్రిక్ బస్సులకు మరో నూటయాభై బస్సులను చేర్చి ప్రజారవాణాను మెరుగుపరచనున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. పార్కింగ్ ఫీజులను భారీగా పెంచితే, ప్రజలు విధిగా ప్రజారవాణావైపు పరుగులు తీస్తారని అది బలంగా నమ్ముతున్నట్టు కనిపిస్తోంది. ప్రజలు నిజంగానే పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు మీదే ఆధారపడితే, ఢిల్లీలో ఉన్న ఆ వ్యవస్థ ఏమాత్రం సరిపోదు. పద్నాలుగువేల బస్సులు అవసరమైన చోట సగం మాత్రమే ఉన్నాయి, నగరంలోని మొత్తం ప్రయాణికుల్లో ఐదుశాతం జనాభాను మాత్రమే మెట్రో తీసుకుపోతోంది. ఇక, వెచ్చదనంకోసం ప్రజలు చెత్తనీ, బొగ్గూకట్టెలూ కాల్చకుండా నిరోధించడానికి తాత్కాలికంగా విద్యుత్ హీటింగ్ స్పాట్‌లు ఏర్పాటు చేస్తే ప్రజలంతా అక్కడికే వెళ్ళి చలికాచుకుంటారని కూడా ప్రభుత్వం నమ్మకం. కాలుష్యకాలం కమ్ముకొచ్చినప్పుడు, బాణాసంచా వినియోగం కూడా ఒక పెద్దసమస్యగా, వివాదంగా మారడం ఏటా ఉన్నదే. టపాసుల వాడకంమీద ఆంక్షలు విధించాలంటూ దాఖలైన పిటిషన్‌మీద సుప్రీంకోర్టు బుధవారం తన అభిప్రాయాన్ని ప్రకటిస్తూ, పూర్తి నిషేధానికి తాను అనుకూలం కాదని, అలాగని, రోజంతా కాల్చడానికి ఒప్పుకోనని వ్యాఖ్యానించింది. కొన్ని రకాల టపాసుల తయారీకి కూడా ఇకపై వీలు కలగబోతోంది. దీపావళినాడు బాణాసంచా కాల్చే విషయంలో సుప్రీంకోర్టు వైఖరిలో ఇటీవల పెనుమార్పు వచ్చిన విషయం తెలిసిందే. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఏలుబడిలో ఉన్నంతకాలం ఢిల్లీలో టపాసులమీద నిషేధం అమలైంది. మొదట్లో బేరియం లవణాలు లేని టపాసుల తయారీకి అనుమతించినప్పటికీ, ఆ మినహాయింపు కూడా దుర్వినియోగం కావడంతో పూర్తి నిషేధం అమలైంది. పాలకుల, న్యాయస్థానాల చొరవవల్ల, పెరిగిన కాలుష్యభయం వల్ల ఢిల్లీ వాసుల్లో కూడా టపాసులమీద మోజు తగ్గింది. విపక్షంలో ఉండగా, ఈ నిషేధాన్ని తప్పుబడుతూ వచ్చిన బీజేపీ ఢిల్లీలో తాను అధికారంలోకి రాగానే టపాసులపై సర్వోన్నత న్యాయస్థానంతోనే సరే కానివ్వండని అనిపించుకుంది. పొరుగురాష్ట్రాల్లో పంటవ్యర్థాలను తగలబెట్టడం కూడా ఢిల్లీ కాలుష్యానికి ఒక బలమైన కారణం కనుక, పరిస్థితిలో మార్పు వస్తున్నా ఈ మారు కూడా ఆ ప్రభావాన్ని కాదనలేం. ఇప్పుడు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలో అనేకం గతకాలంలోనూ అమలు జరిగినవే. గద్దెమీద ఎవరున్నా ఈ తక్షణ ఉపశమన చర్యలనే మహాద్భుతమైనవిగా అభివర్ణించుకోవడం సహజం. గ్యాస్ చాంబర్‌లాగా తయారైన ఢిల్లీలో వాయురూపంలో ఉన్న విషాన్ని దిగమింగుతున్న సామాన్యులకు ఏటా వచ్చే ఈ ఆపదనుంచి విముక్తి ఎప్పుడో తెలియడం లేదు.

పాన్ ఐఐటీ.. రాష్ట్ర భవిష్యత్తుకు ఇన్నోవేషన్ ఇంజిన్



ఒక రాష్ట్రాన్ని మార్చేది కేవలం భారీ పెట్టుబడులు కాదు. ఆ పెట్టుబడులకు దారితీసే ఆలోచనలు, ఆ ఆలోచనలను ఆవిష్కరణలుగా మలిచే పరిశోధన, ఆ ఆవిష్కరణలను పరిశ్రమలుగా తీర్చిదిద్దే సమర్థ వ్యవస్థ. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతున్న ప్రస్తుత సమయంలో ఒక రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించేది కేవలం సహజ వనరులు మాత్రమే కాదు.. జ్ఞానం, నైపుణ్యం, సాంకేతికత, ఆవిష్కరణ సామర్థ్యం. అందుకే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో పాన్ ఐఐటీ వంటి మేధో వేదికకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.

నేడు విజయవాడలో జరగనున్న పాన్ ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సమ్మిట్ ఈ దిశగా ఒక ముఖ్యమైన ప్రయత్నం. దేశ విదేశాల్లో ఉన్న ఐఐటీ పూర్వ విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలు, పాలసీ రూపకర్తలను ఒకే వేదికపైకి తీసుకురావడం దీని ప్రధాన ఉద్దేశం. వారి అనుభవం, పరిజ్ఞానం, పరిచయాలు, పెట్టుబడి సామర్థ్యాన్ని ఏపీ అభివృద్ధికి అనుసంధానం చేయడం ద్వారా కొత్త అవకాశాలను సృష్టించవచ్చు.

అమెరికాలో స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం చుట్టూ ఏర్పడిన పరిశోధన, పరిశ్రమ వాతావరణం సిలికాన్ వ్యాలీకి బలమైన పునాది వేసింది. జర్మనీలోని ఫ్రాన్‌హోఫర్ సంస్థలు పరిశోధనను పరిశ్రమ అవసరాలతో అనుసంధానం చేసి సాంకేతికతను వాణిజ్యీకరణ దిశగా తీసుకెళ్తున్నాయి. ఇజ్రాయెల్ స్టార్టప్ వ్యవస్థ, సింగపూర్ పరిశోధన-- పరిశ్రమ అనుసంధానం, తైవాన్ సెమీకండక్టర్ పర్యావరణం కూడా నాలెడ్జ్ ఆర్థిక శక్తిగా ఎలా మారుతుందో చూపిస్తున్నాయి.

ఈ నమూనాల నుంచి రాష్ట్రం నేర్చుకోవాల్సిన ప్రధాన విషయం ఒక్కటే. ప్రతిభను ఒకచోట చేర్చడం మాత్రమే కాదు.. ఆ ప్రతిభను రాష్ట్రాభివృద్ధి అవసరాలతో అనుసంధానం చేయాలి. రాష్ట్రంలోని సమస్యలకు ఐఐటీలు, పరిశోధన సంస్థలు, పరిశ్రమలు కలిసి పరిష్కారాలు చూపే విధానం రావాలి. కొత్త ఆలోచనలు ప్రోటోటైప్‌లుగా మారాలి. ప్రోటోటైప్‌లు స్టార్టప్‌లుగా మారాలి. స్టార్టప్‌లకు పెట్టుబడులు రావాలి. అవి పరిశ్రమలుగా ఎదిగి ఉపాధి కల్పించాలి. ఆ ఉపాధి, ఉత్పాదకత చివరకు... రాష్ట్ర ఆర్థిక వృద్ధికి బాట వేయాలి అనే వ్యవస్థ రాష్ట్రంలో ఏర్పడాలి. ఇదే నిజమైన ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్.

దేశం కూడా ఇదే దిశగా అడుగులు వేస్తోంది. ఇండియా ఏఐ మిషన్, నేషనల్ క్వాంటమ్ మిషన్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ వంటి కార్యక్రమాల ద్వారా కృత్రిమ మేధస్సు, క్వాంటమ్, డీప్‌టెక్, రోబోటిక్స్, సెమీకండక్టర్లు, బయోటెక్నాలజీ, మెడికల్ డివైజెస్ వంటి రంగాల్లో పరిశోధన, ప్రైవేట్ పెట్టుబడులకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ జాతీయ అవకాశాలను రాష్ట్ర అవసరాలతో అనుసంధానం చేసుకోవడం కీలకం. ఈ నేపథ్యంలో అమరావతిలో ఏఐ, క్వాంటమ్ రంగాలకు ప్రత్యేక యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుకు ఎన్ఐఈఎల్ఐటీ, రాష్ట్రం మధ్య జరిగిన ఒప్పందం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. క్వాంటమ్ కంప్యూటింగ్ ఏఐ/ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ హార్డ్‌వేర్, ఏఐ-- క్వాంటమ్ రీసెర్చ్, ఇండస్ట్రీ లింక్డ్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, డీప్‌టెక్ ఇంక్యుబేషన్ వంటి రంగాలను ఒకే పరిధిలోకి తీసుకురావాలనే ఆలోచన భవిష్యత్ సాంకేతిక అవసరాలకు అనుగుణంగా ఉంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఐబీఎంతో భాగస్వామ్యం, క్వాంటమ్ కంప్యూటింగ్ మౌలిక వసతుల ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలు కూడా ఈ దిశలోనే ఉన్నాయి. అయితే ఇలాంటి ప్రాజెక్టులు, సంస్థలు ఏర్పడితేనే సరిపోదు. వాటి చుట్టూ పరిశోధన, పెట్టుబడి, పరిశ్రమ, స్టార్టప్ వ్యవస్థ ఏర్పడాలి. ఒక ఆలోచనకు నిధులు దొరకాలి. ఒక పరిశోధనకు పరిశ్రమ భాగస్వామ్యం కావాలి. ఒక స్టార్టప్‌కు మార్కెట్ దొరకాలి. ఒక విద్యార్థికి ప్రపంచస్థాయి మెంటార్ లభించాలి. ఒక పరిశ్రమకు అవసరమైన నైపుణ్యం రాష్ట్రంలోనే అందుబాటులో ఉండాలి. అప్పుడే మేధస్సు ఆర్థిక విలువగా మారుతుంది. పాన్ ఐఐటీని ఈ మొత్తం వ్యవస్థకు అనుసంధానించే వేదికగా మలచాల్సిన అవసరం ఇక్కడ కనిపిస్తుంది. కేవలం ఏడాదికి ఒకసారి జరిగే సదస్సుగా కాకుండా, పాన్ ఐఐటీ అమరావతి కౌన్సిల్, గ్లోబల్ ఐఐటీ మెంటార్ నెట్‌వర్క్, డీప్‌టెక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ పరిశ్రమలతో అనుసంధానమైన పరిశోధన కేంద్రాలు వంటి శాశ్వత వ్యవస్థలు ఏర్పడితే దాని ప్రభావం మరింత విస్తరించవచ్చు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలోని వివిధ రంగాలకు ఈ మేధోశక్తిని అనుసంధానం చేయవచ్చు.

ప్రపంచం ఇప్పుడు ఏఐ, క్వాంటమ్, సెమీ కండక్టర్స్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, స్పేస్‌టెక్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో కొత్త పోటీని చూస్తోంది. రేపటి ఆర్థిక శక్తి ఈ సాంకేతిక రంగాల్లోనే రూపుదిద్దుకోనుంది. ఈ పోటీలో నిలబడాలంటే భౌతిక మౌలిక వసతులతో పాటు మేధో మౌలిక వసతులు కూడా నిర్మించాలి. పరిశోధనకు ప్రాధాన్యం ఇవ్వాలి. యువత నైపుణ్యాలను పెంచాలి. ఆవిష్కరణలకు పెట్టుబడులు అందించాలి. విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య దూరాన్ని తగ్గించాలి. అందుకే పాన్ ఐఐటీని మరో సదస్సుగా చూడకూడదు. వికసిత్ భారత్--2047 లక్ష్యానికి అనుగుణంగా జ్ఞానాధారిత, సాంకేతికంగా శక్తిమంతమైన, ఆవిష్కరణలకు నిలయమైన రాష్ట్రంగా తీర్చిదిద్దే దీర్ఘకాలిక వేదికగా మలచాలి. ప్రపంచ ఐఐటీ మేధస్సును రాష్ట్ర భవిష్యత్తుతో అనుసంధానం చేయగలిగితే.. పాన్ ఐఐటీ ఒక కార్యక్రమంగా కాక, రాష్ట్ర భవిష్యత్తును నడిపించే ఇన్నోవేషన్ ఇంజిన్‌గా రూపుదిద్దుకుంటుంది.

ప్రభుత్వ వ్యతిరేకతకు బీజేపీ అతీతమా?

రాహుల్‌గాంధీ ఇటీవల ఒక ప్రశ్న అడిగారు. రాజకీయ వర్గాలలో కలకలం సృష్టించిన ఆ ప్రశ్న సులభంగా ఉన్నట్టు కనిపిస్తున్నా నిజానికి సంక్లిష్టమైనది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, భారతీయ జనతా పార్టీ ఒక దశాబ్దానికి పైగా అధికారంలో ఉన్నప్పటికీ ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావానికి ఎందుకు గురికావడం లేదు? 1977లో ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉన్న కారణంగా మా నానమ్మ ఇందిర సైతం ఓడిపోయారు అని ఆయన అన్నారు. మోదీ నేతృత్వంలోని బీజేపీ అధికారంలో కొనసాగేలా ఎన్నికల ప్రక్రియను తారుమారు చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు.

ఇది చాలా తీవ్రమైన ఆరోపణ. ఎన్నికల్లో జయాపజయాల విషయమై రాహుల్ ఇటీవల చేసిన వివిధ వ్యాఖ్యలలో మాదిరిగానే తాజా ఆరోపణలో కూడా ఒక ఇబ్బందికరమైన సత్యం ఉంది. ఒక విషయంలో రాహుల్ సరిగానే మాట్లాడారు. ఎన్నికల సంఘం తీవ్ర విశ్వసనీయత లోటును ఎదుర్కొంటోంది. అవును, ఈ సత్యం ఇంకెంత మాత్రం ఒక చర్చనీయాంశంగా ప్రతిపక్షాలకే పరిమితమై లేదు. ఈసీఐపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారనడం సత్యదూరం కాదు. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్లు నివేదించిన వివరాలలో 'తార్కిక వ్యత్యాసం'కు సంబంధించిన సమస్యలు, లక్షలాది ఓటర్ల తొలగింపుపై రగడ, ఓటర్ల అప్పీళ్లపై విచారణలో జాప్యం మొదలైనవన్నీ ఎన్నికల సంఘం పారదర్శకతపై న్యాయబద్ధమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. రాజ్యాంగ సంస్థల మధ్య 'విశ్వాస లోటు' ఉన్నదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించిందంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

ఓటర్ జాబితాల ధర్మబద్ధత గురించి పట్టించుకునే ఎవరికైనా ఈ అంకెలు ఆందోళన కలిగిస్తాయి. బెంగాల్‌లో ఇంతవరకు 22 లక్షల మంది పౌరులు తమ ఓటు హక్కు తొలగింపుపై అప్పీల్ చేశారు. విచారణ పూర్తయిన అప్పీళ్లలో 93శాతం మంది చట్టబద్ధమైన ఓటర్లే అని నిర్ధారణ అయింది. ఎన్నికలు అంటే కేవలం పోలింగ్ రోజున జరిగే ప్రక్రియ మాత్రమే కాదు. ఓటర్ జాబితాలలో ఎవరికి చోటు దక్కుతుందనే అంశంతోనే నిజానికి ఎన్నికలు ప్రారంభమవుతాయి. మరి తన పనితీరుపై ఆందోళనలను కేవలం రాజకీయ ఆరోపణలు మాత్రమేనని ఎన్నికల సంఘం ఎలా కొట్టివేయగలుగుతుంది? ఎన్నికల సంఘం తటస్థ మధ్యవర్తిగా వ్యవహరించడం లేదనే ఆందోళనలు ఇటీవల వివిధ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించిన తీరుతెన్నుల ఆధారంగానే వ్యక్తమవుతున్నాయన్నది నిరాకరించలేని వాస్తవం.

మన దేశంలో ఒపీనియన్ పోల్స్ నిర్వహించే ఏజెన్సీలు కూడా రాజకీయ కుట్రల్లో భాగమా? 2014 నుంచి నరేంద్ర మోదీకి ప్రజాదరణ-- ముఖ్యంగా హిందీ భాషా రాష్ట్రాలలోను, పశ్చిమ భారత రాష్ట్రాలలోనూ అంతకంతకూ పెరుగుతోందని అన్ని ఒపీనియన్ పోల్స్ ఫలితాలు నిర్ధారిస్తూనే ఉన్నాయి. ఆ పోల్స్ అన్నీ ప్రామాణిక పద్ధతులలో జరిగి ఉండకపోవచ్చు. అయినంతమాత్రాన వాటి ఫలితాలకు కారణమైన రాజకీయ పరిణామాన్ని కొట్టివేయడం సబబు కాదు. దానిని నిష్పాక్షికంగా అర్థం చేసుకోవాలి. కాంగ్రెస్ పార్టీకి అసాధ్యంగా ఉన్న మహా శక్తిమంతమైన రాజకీయ, సంస్థాగత యంత్రాంగాన్ని బీజేపీ అభివృద్ధిపరచుకున్నది. కార్యకర్తల బలాన్ని అపారంగా పెంచుకున్నది. పైగా ఆరెస్సెస్ నుంచి సంపూర్ణ మద్దతు బీజేపీకి లభిస్తోంది. ఆర్థిక వనరులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి. పార్టీ సందేశాలను ప్రభావదాయకంగా ప్రజలలోకి తీసుకువెళ్లే సామర్థ్యం తక్కువేమీ కాదు. కనుకనే జాతీయ ప్రాధాన్యమున్న అంశాలను ఎన్నికల ప్రచారానికి చాలా నేర్పుగా, ప్రయోజనకరంగా ఉపయోగించుకోవడంలో బీజేపీ సదా సఫలమవుతోంది.

ఎన్నికల వ్యయాలపై ఈసీఐకి నివేదించిన వివరాల ప్రకారం, ఈ ఏడాది ఐదు రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ మొత్తం రూ.529.38 కోట్లు ఖర్చు చేసింది. ఆ ఐదు రాష్ట్రాలలో కాంగ్రెస్ చేసిన వ్యయం రూ. 248.55 కోట్లు. బీజేపీ ఒక్క బెంగాల్‌లోనే చేసిన వ్యయం, ఐదు రాష్ట్రాలలో కాంగ్రెస్ ఖర్చు చేసిన మొత్తం కంటే ఎక్కువగా ఉన్నది. ఈసీఐ వెల్లడించిన లెక్కల ప్రకారం, బెంగాల్‌లో బీజేపీ ఎన్నికల వ్యయం రూ.286.99 కోట్లుగా ఉన్నది. ఆయా పార్టీలు చేసిన వ్యయాలు ఇంకా అధికంగా ఉంటాయనడంలో సందేహం లేదు. అయితే అవేవీ ఎన్నికలలో అక్రమాలు జరిగాయన్న విషయాన్ని రుజువు చేయలేవు. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల కాలంలోనే తమకు అందిన విరాళాలు మొత్తం రూ.1,473 కోట్లు అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయం వెల్లడించింది. అదే కాలంలో కాంగ్రెస్‌కు విరాళాల రూపేణా కేవలం రూ.207 కోట్లు మాత్రమే సమకూరాయి. చెప్పవచ్చినదేమిటంటే ఒక శక్తిమంతమైన ఎన్నికల యంత్రాంగం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవడానికి ఎలాంటి కుట్ర సిద్ధాంతాలు అవసరం లేదు. గతంలో దశాబ్దాలుగా అధికారంలో ఉన్న ప్రధాన ప్రతిపక్షం అధికార పార్టీతో సమానంగా సమర్థ యంత్రాంగాన్ని ఎందుకు నిర్మించుకోలేకపోయింది? ఈ ప్రశ్నను రాహుల్‌గాంధీ ఎదుర్కోవాలి.

కాంగ్రెస్‌కు వాటిల్లిన సమస్యలన్నిటికీ ఈసీఐని తప్పుపట్టడం ఎంతమాత్రం వివేకం కాదు. నాయకత్వ తగాదాలు, సంస్థాగత క్షీణత, ముఠాల కుమ్ములాటలు, ఫిరాయింపులు, బలహీనపడిన పీసీసీలు మొదలైనవన్నీ కాంగ్రెస్ స్వయంకృతాలే కానీ ఈసీఐ ప్రమేయంతో జరిగినవి కావు కదా. ఇదిగో ఇక్కడే ప్రభుత్వ వ్యతిరేకత అనే వాదన మరింత ఆసక్తికరమవుతోంది. ఎందుకంటే ప్రభుత్వ వ్యతిరేకత అనేది ఉంది. అదొక వాస్తవం. 2018లో మూడు హిందీ రాష్ట్రాలలో బీజేపీని కాంగ్రెస్ ఓడించింది. 2023లో కర్ణాటకలో బీజేపీ అధికారాన్ని కోల్పోయింది. 2024 సార్వత్రక ఎన్నికలలో బీజేపీ కనీస మెజారిటీని కూడా సాధించుకోలేకపోయింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మిత్రపక్షాలపై ఆధారపడడం అనివార్యమయింది. భారతీయ ఓటర్లు అధికారంలో ఉన్నవారిని శిక్షిస్తారని, శిక్షించగలరని ఈ జయాపజయాలు స్పష్టం చేస్తున్నాయి. మోదీపై ప్రభుత్వ వ్యతిరేకత ఎందుకు పనిచేయడం లేదు? ప్రతిపక్షాలు ప్రభుత్వ వ్యతిరేకతను ఒక సుస్థిర జాతీయ ప్రత్యామ్నాయంగా ఎందుకు మార్చలేకపోతున్నాయి? మొదటిదానికంటే రెండోదే మరింత ఆసక్తికరమైన ప్రశ్న. ఈ రెండు ప్రశ్నల మధ్య ఉన్న తేడా చాలా ముఖ్యమైనది.

బీజేపీని ఎన్నికల్లో ఓడించడం అసాధ్యం కావచ్చు కానీ ప్రతిపక్షాలు ఆ పార్టీని రాజకీయంగా ఎందుకు ఎదుర్కోలేకపోతున్నాయి, సులభంగా ఎందుకు ఓడిపోతున్నాయని కాంగ్రెస్ తప్పక ప్రశ్నించుకోవాలి. నైరాశ్యానికి లోనవుతూ దాన్ని అధిగమించడానికి ప్రయత్నించకపోతే ఎలా? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పన్నెండేళ్లకు పైగా దేశాన్ని పరిపాలిస్తున్నారు. రాజకీయ అలసట, అసంతృప్తి, బలహీనతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రతిపక్షాలకు ఇదొక రాజకీయ అవకాశం. అయితే రాజకీయ అవకాశమే రాజకీయ విజయానికి రాచబాట వేయదు. ప్రభుత్వ వ్యతిరేకత అయితే ఉన్నది. దానిని ఓట్లు, సీట్లుగా మార్చడానికి ఒక సువ్యవస్థిత రాజకీయ వేదిక అవసరం.

మళ్లీ రాహుల్‌గాంధీ వద్దకు వెళదాం. తన ప్రశ్నలకు ఈసీఐ సమాధానాలు చెప్పాలని ఆయన డిమాండ్ చేయడం సమంజసమే. ఎన్నికల సంఘానికి, ఆ మాటకు వస్తే ఏ రాజ్యాంగ సంస్థకు అయినా పారదర్శకత, జవాబుదారీతనం, సంస్థాగత విశ్వసనీయత ఉండడం అవసరం. ఓటర్ల జాబితాపై రగులుతున్న వివాదం స్పష్టం చేస్తున్నదేమిటి? ఈసీఐ తన విధులను మరింత పారదర్శకతతో నిర్వహించాలనే కాదూ? సర్ ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని సంపూర్ణంగా వెల్లడించాలి. దానిని స్వతంత్ర వ్యక్తులు, సంస్థలు పరిశీలించి నిగ్గు తేల్చాలి. ఇది తప్పనిసరి.

ఈసీఐ ప్రమేయం కీలకంగా లేని ప్రాంతాలలో కాంగ్రెస్ పరాజయం పాలయింది. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కాంగ్రెస్‌కు ఘనమైన ఎన్నికల విజయాలు లభించాయి. ఎన్నికల మధ్యవర్తి-- అంటే ఈసీఐ తన విధులు సక్రమంగా నిర్వర్తించనందునే బీజేపీ అసాధారణ విజయాలు మూటగట్టుకుందని విమర్శించడం సబబుకాదు. ఈసీఐ కంటే బాగా సహాయకారి అయిన రాజకీయ, సంస్థాగత, సైద్ధాంతిక, నాయకత్వ కారణాలు బీజేపీ విజయాల వెనుక ఉన్నాయి. ఈ వాస్తవాన్ని విపక్షాలు విస్మరించకూడదు.

యుద్ధం విషయంలో భారత్ వ్యూహం మారిందా?

రష్యా, ఉక్రెయిన్‌తో నేరుగా మాటామంతీ

ఉక్రెయిన్ యుద్ధంపై ఇన్నాళ్లూ శాంతి కోసం భారత్ వాదనకే పరిమితం

ఇప్పుడు రష్యా, ఉక్రెయిన్ రెండింటితోనూ నేరుగా చర్చలు

మోదీకి మంచి ఆలోచనలు ఉన్నాయన్న పుతిన్ వ్యాఖ్యల తర్వాత కీలక పరిణామం

=బంంఱు ఖఎతీుఱఅవ ఔుతీ

ఉక్రెయిన్ యుద్ధం విషయంలో భారత్ వైఖరి ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసినట్లుగా కనిపిస్తోంది. ఇన్నాళ్లూ యుద్ధానికి ముగింపు పలకాలని, చర్చలు-దౌత్యం ద్వారానే సమస్యకు పరిష్కారం సాధ్యమని చెబుతూ వచ్చిన భారత్.. ఇప్పుడు రష్యా, ఉక్రెయిన్‌తో నేరుగా మాట్లాడుతోంది. ఈ విషయాన్ని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్వయంగా వెల్లడించారు. దీంతో ఉక్రెయిన్ యుద్ధ పరిష్కారంలో భారత్ పాత్రపై మరోసారి చర్చ మొదలైంది. న్యూదిల్లీలో జరిగిన మ్యూనిక్ లీడర్స్ మీటింగ్?లో జైశంకర్ ఆ విషయాలను వెల్లడించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై భారత్ మొదటి నుంచీ ఒకే వైఖరితో ఉందని చెప్పారు. యుద్ధానికి ముగింపు రావాలని, అందుకు చర్చలు, దౌత్యమే మార్గమని స్పష్టం చేశారు. అయితే గత కొన్ని నెలలుగా భారత్ తన ప్రయత్నాలను మరింత పెంచిందని తెలిపారు.

రష్యా, ఉక్రెయిన్‌తో మాట్లాడుతున్నాం

"ఇన్నాళ్లూ మేం శాంతి కోసం వాదిస్తూ వచ్చాం. అయితే ఇటీవలి నెలల్లో దానికి మించి కొంత ఎక్కువగా మేం భాగస్వాములమయ్యాం. రష్యా, ఉక్రెయిన్ రెండింటితోనూ మాట్లాడుతున్నాం" అని జైశంకర్ చెప్పారు. ముఖ్యంగా రెండు దేశాల మధ్య వెంటనే పరిష్కరించగల అంశాలపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఇందులో మొదటగా బ్లాక్ సీలో నౌకల రాకపోకలకు భద్రత కల్పించే అంశాన్ని భారత్ తీసుకున్నట్లు జైశంకర్ చెప్పారు. ఉక్రెయిన్ నుంచి ధాన్యం ఎగుమతులు, ఇంధన సరఫరా వంటి అంశాలపైనా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే ఒకరిపై ఒకరు దాడులు చేయకుండా ఉండే అవకాశాలపైనా చర్చిస్తున్నట్లు వెల్లడించారు. అంటే యుద్ధాన్ని ఒక్కసారిగా ఆపేయాలనే పెద్ద లక్ష్యంతో మాత్రమే కాకుండా, రెండు దేశాల మధ్య ఉన్న కొన్ని తక్షణ సమస్యలకు పరిష్కారం చూపించే దిశగానూ భారత్ ప్రయత్నాలు



చేస్తున్నట్లు జైశంకర్ మాటలను బట్టి అర్థమవుతోంది.

మోదీ ప్రయత్నాలను ప్రశంసించిన పుతిన్

ఈ పరిణామాలకు కొద్ది రోజుల ముందే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రధాని నరేంద్ర మోదీపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం కనుగొనే విషయంలో మోదీకి మంచి ఆలోచనలు ఉన్నాయని పుతిన్ చెప్పారు. యుద్ధానికి ముగింపు పలకాలని మోదీ ప్రతి సమావేశంలోనూ ప్రస్తావిస్తుంటారని తెలిపారు. పరస్పరం అంగీకరించగల పరిష్కారం కోసం మోదీ ప్రయత్నిస్తున్నారని పుతిన్ పేర్కొన్నారు. అంతేకాదు, ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహా కూడా భారత్ ప్రతిపాదనపై ఇటీవల స్పందించారు. కాల్పుల విరమణకు సంబంధించి తమకు భారత్‌తో పాటు టర్కీ, ఈజిప్ట్, అమెరికా నుంచి ప్రతిపాదనలు వచ్చాయని చెప్పారు. వీటిలో భారత్ ప్రతిపాదన విస్తృతమైనదిగా ఉందని ఆయన పేర్కొన్నారు. బ్లాక్ సీ, ఇంధన మౌలిక వసతులకు సంబంధించిన అంశాలపై కాల్పుల విరమణను పరిశీలించేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని తెలిపారు.

రష్యాతో బంధం- ఇప్పుడు మరింత విస్తృతం

ఇక రష్యాతో భారత్‌కు ఉన్న సంబంధాల గురించి కూడా జైశంకర్ మాట్లాడారు. 1950ల నుంచే ఇరు దేశాల మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు. భద్రత, ప్రాదేశిక సమగ్రత విషయంలో గతంలో సోవియట్ యూనియన్ భారత్‌కు అండగా నిలిచిందని చెప్పారు. అయితే ఇప్పుడు భారత్-రష్యా సంబంధాలు కేవలం రక్షణ రంగానికే పరిమితం కాలేదని జైశంకర్ తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, అణు రంగం, అంతరిక్షం వంటి అనేక రంగాల్లో రెండు దేశాల మధ్య సంబంధాలు విస్తరించాయని చెప్పారు. మొత్తంగా చూస్తే ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ వైఖరి ఇప్పుడు మాటలకే పరిమితం కాకుండా ఆచరణాత్మక చర్చల దిశగా వెళ్తున్నట్లు జైశంకర్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. రష్యా, ఉక్రెయిన్ రెండింటితోనూ భారత్‌కు ఉన్న సంబంధాలను ఉపయోగించి శాంతి ప్రయత్నాల్లో తన పాత్రను మరింత పెంచే దిశగా న్యూదిల్లీ అడుగులు వేస్తున్నట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి.

ఎటునుంచెనా దాడి చేసే సామర్థ్యం ఇండియాకే సొంతం

భారత్ వద్ద 190 ?అణ్వాయుధాలు!

అంతర్జాతీయ సంస్థ దీూూ సంచలన నివేదిక

నో ఫస్ట్ యూజ్' విధానానికి కట్టుబడి ఉన్నా

బలమైన ప్రతిదాడికి సిద్ధంగా ఉన్న భారత్

చైనా, పాకిస్థాన్‌లోని ప్రతి మూలను ఛేదించగల 'అగ్ని-5' క్షిపణి

భారతదేశ అణు సామర్థ్యం, రక్షణ శక్తిపై అంతర్జాతీయంగా మరోసారి కీలకమైన నివేదిక వెలువడింది. భారత్ వద్ద ప్రస్తుతం సుమారు 190 అణ్వాయుధాలు అందుబాటులో ఉన్నాయని, శత్రుదేశాల గుండెల్లో నిద్రపోయేలా సుదూర లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించగల అధునాతన క్షిపణి వ్యవస్థలను నిరంతరం ఆధునీకరిస్తోందని ప్రముఖ అంతర్జాతీయ సంస్థ 'బులెటిన్ ఆఫ్ ద అటామిక్ సైంటిస్ట్స్' వెల్లడించింది. ముందుగా అణుదాడి చేయం అనే సూత్రానికి కట్టుబడి ఉంటూనే శత్రువులు దాడికి పాల్పడితే కోలుకోలేని దెబ్బతీసే రీతిలో భూమి, ఆకాశం, సముద్ర మార్గాల్లో 'న్యూక్లియర్ ట్రయాడ్'ను భారత్ సిద్ధంగా ఉంచుకుంది.

భూమి, ఆకాశం, సముద్రం నుంచి అణు దాడులు చేయగల సామర్థ్యం భారత్‌కు సొంతం

భారత్ తన వద్ద ఉన్న అణు ఆయుధ సంపత్తిని, క్షిపణి పరిధిని అధికారికంగా ఎప్పుడూ బహిర్గతం చేయదు. అయినప్పటికీ, భారత్ వద్ద దాదాపు 190 అణ్వాయుధాలు ఉండే అవకాశం ఉందని అంతర్జాతీయ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇతర దేశాల సహాయం లేకుండా స్వదేశీ సాంకేతికతతో ణ=ణూ అభివృద్ధి చేసిన క్షిపణులు భారత్‌కు బలమైన రక్షణ కవచంగా మారాయని కొనియాడారు. ఆకాశ మార్గంలో అణు దాడులు చేయగల సామర్థ్యంలో మిరాజ్ 2000, జాగ్వార్ విమానాలు ప్రస్తుతం కీలక పాత్ర పోషిస్తున్నాయి. భవిష్యత్తులో జాగ్వార్ విమానాల స్థానంలో ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసిన అత్యాధునిక రఫేల్ యుద్ధ విమానాలు ఈ బాధ్యతలను స్వీకరించనున్నాయి.

నౌకాదళంలోకి మూడో అణు జలాంతర్గామి 'xచీూ అరిధమన్'

భారత సాయుధ దళాల వెన్నెముకగా నిలిచిన అగ్ని క్షిపణులు సుదూర లక్ష్యాలను ఛేదించగలవు. అగ్ని-x నుంచి అగ్ని-xఒ క్షిపణులు 700 కిలోమీటర్ల నుంచి 3,500 కిలోమీటర్ల కంటే ఎక్కువ పరిధి కలిగి ఉన్నాయి. 6 వేల కిలోమీటర్ల పరిధి కలిగి ఉన్న అగ్ని-5 మొత్తం పాకిస్థాన్, చైనా భూభాగంతో పాటు మధ్య ఆసియా, రష్యా, ఆగ్నేయాసియా, పశ్చిమాసియా,



ఐరోపా ఖండంలోని ప్రధాన భాగాలను లక్ష్యంగా చేసుకోగలదు. అగ్ని-5 ద్వారా ఒకేసారి వేర్వేరు లక్ష్యాలపై దాడి చేసే సాంకేతికతను భారత్ ఇప్పటికే విజవంతంగా పరీక్షించింది. అణుదాడికి గురైనా సరే, తిరిగి శత్రువుపై భయంకరమైన ప్రతిదాడి చేయడంలో సముద్ర ఆధారిత 'న్యూక్లియర్ ట్రయాడ్' కీలకమైనది. భారత్ తన మూడో స్వదేశీ అణు జలాంతర్గామి 'xచీూ అరిధమన్'ను నౌకాదళంలో చేర్చింది. ఇప్పటికే సేవలందిస్తున్న xచీూ అరిహంత్, xచీూ అరిఘాత్?లతో పాటు xచీూ అరిధమన్ చేరికతో భారత్ సముద్ర అణు రక్షణ వ్యవస్థ అత్యంత శక్తివంతంగా మారింది. సముద్ర గర్భం నుంచి ప్రయోగించే ఖ-4 క్షిపణులు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి.

ఏఏ దేశాల వద్ద ఎన్ని ఉన్నాయంటే?

ఇదిలా ఉండగా, ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, యుద్ధాల నేపథ్యంలో ఇటీవలి కాలంలో అనేక దేశాలు తమ సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా అణుశక్తి కలిగిన దేశాలు తమ ఆయుధ సంపత్తిని మరింత మెరుగుపరుచుకుంటున్నాయి. ప్రపంచంలో అత్యధిక అణ్వాయుధాలున్న దేశాలుగా అమెరికా, రష్యా ముందు వరుసలో ఉన్నాయి. ఈ మేరకు స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ (సిప్రి) కొద్దిరోజుల క్రితం ఒక నివేదికలో వెల్లడించింది. రష్యా వద్ద 5,420, అమెరికా వద్ద 5,042 అణు వార్‌హెడ్లు ఉన్నాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా అణుశక్తి దేశాలు కలిగిన దేశాలు తొమ్మిది కాగా, వాటి వద్ద మొత్తంగా 12వేలకు పైగా అణ్వాయుధాలు ఉన్నట్లు వెల్లడించింది. ఈ జాబితాలో యూకే (225), ఫ్రాన్స్ (370), ఉత్తరకొరియా (60), ఇజ్రాయెల్ (90), దేశాలున్నాయి. ఈ ఏడాది జనవరి నాటికి భారత్ వద్ద 190 అణ్వాయుధాలు ఉన్నాయని, అది పాక్? కంటే ఎక్కువేనని సిప్రి నివేదించింది. ఏడాది వ్యవధిలో భారత్ 10 వార్‌హెడ్లను పెంచుకుందని నివేదికలో పేర్కొంది. అలాగే, చైనా వద్ద 620 అణ్వాయుధాలు ఉన్నాయని పేర్కొంది. గతేడాదితో పోలిస్తే బీజింగ్ 20 అణు వార్‌హెడ్‌లను తన ఆయుధాగారంలోకి చేర్చుకుందని తెలిపింది.

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

తిరుమల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. శ్రీవారి దర్శనార్థం వచ్చిన యాత్రికులతో కొండపై రద్దీ వాతావరణం నెలకొంది. ఇవాళ వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో, క్యూలైన్లు వెలుపలికి వచ్చి సుమారు కిలోమీటరు దూరంలోని శిలాతోరణం వరకు చేరాయి. ప్రస్తుతం స్వామివారి సర్వదర్శనానికి (ఘాణ టోకెన్లు లేనివారికి) సుమారు 18 గంటల సమయం పడుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు. నిన్న శనివారం (అక్టోబర్ 3) ఒక్కరోజే 91,296 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 32,805 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 5.06 కోట్లుగా నమోదైంది. టీటీడీ అధికారులు 4.67 లక్షల లడ్డూలను విక్రయించారు. అలాగే, సుమారు 3.19 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. రద్దీ కారణంగా భక్తుల సౌకర్యార్థం టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్లలో ఉన్నవారికి తాగునీరు, అల్పాహారం వంటివి అందిస్తున్నారు. వైద్య సేవలు అవసరమైన వారి కోసం అశ్విని ఆసుపత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం నాడు 4,516 మందికి వైద్య సేవలు అందించినట్లు అధికారులు తెలిపారు. భక్తులు సంయమనం పాటిస్తూ టీటీడీ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా దాడి.. ఒకరి మృతి

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్న వేళ, ఉక్రెయిన్‌లోని భారతీయ ఫార్మా కంపెనీపై భీకర దాడి జరిగింది. రష్యా ప్రయోగించిన డ్రోన్లు సుమీ నగరంలోని 'కుసుమ్ గ్రూప్'కు చెందిన ఫార్మా ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. మృతులు, క్షతగాత్రుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ దాడిలో ప్లాంట్‌లోని ప్రధాన నిర్మాణం దాదాపు పూర్తిగా ధ్వంసమైంది. డ్రోన్లు దాడి చేసిన ప్రాంతం నుంచి భారీగా పొగ కమ్ముకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ దాడి వల్ల సుమారు రూ.400 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. విశేషమేమిటంటే.. రెండేళ్లకు పైగా యుద్ధం జరుగుతున్నప్పటికీ, ఈ ప్లాంట్ నిరంతరాయంగా ఉత్పత్తిని కొనసాగిస్తూనే ఉంది. తాజా దాడితో కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. భారతీయుడైన రాజీవ్ గుప్తా నేతృత్వంలో కుసుమ్ గ్రూప్ నడుస్తోంది. ఈ సంస్థ 1994లో భారతీయ ఔషధాలను ఉక్రెయిన్‌కు ఎగుమతి చేసే డిస్ట్రిబ్యూటర్‌గా ప్రారంభమై, ఆ తర్వాత సొంత బ్రాండ్లను మార్కెటింగ్ చేసింది. 2009లో సుమీ నగరంలో తయారీ ప్లాంట్‌ను స్థాపించింది. ఈ గ్రూప్ ఉక్రెయిన్, ఉజ్బెకిస్థాన్, కజకిస్థాన్ వంటి 9కి పైగా దేశాలకు 50 రకాల జనరిక్ ఔషధాలను విక్రయిస్తోంది. గత కొంతకాలంగా రష్యా.. చవకైన, వేగవంతమైన షాహెద్ డ్రోన్లతో ఉక్రెయిన్‌పై నిరంతరం దాడులు చేస్తోంది. ఈ డ్రోన్లను అడ్డుకోవడం ఉక్రెయిన్ వాయు రక్షణ వ్యవస్థలకు సవాలుగా మారింది. ఇదే సమయంలో, ఉక్రెయిన్ కూడా దేశీయంగా తయారుచేసిన 'ఎఫ్‌పీ-7' బాలిస్టిక్ క్షిపణిని ఈ వారంలో తొలిసారిగా ప్రయోగించినట్లు ప్రకటించింది. దీని పరిధి సుమారు 250 కిలోమీటర్లు కావడం గమనార్హం.

అమెరికా కావాలనే ఒంటరి శక్తిగా మారింది



ప్రస్తుత ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో వేగంగా మారుతున్న సమీకరణాలపై భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అమెరికా మారుతున్న తీరు, చైనా ఎదుగుదలే అంతర్జాతీయ స్థితిగతులను ప్రభావితం చేస్తున్న రెండు ప్రధాన అంశాలు అని స్పష్టం చేశారు. ఈ మేరకు జర్మనీలో జరిగిన మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్‌లో విదేశాంగ మంత్రి విశ్లేషించారు. ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థలో స్పష్టంగా కనిపిస్తున్న మొదటి మార్పు అమెరికా తన స్థానాన్ని, వ్యూహాన్ని మార్చుకోవడమే. ఆ దేశం ఇటీవల తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అది స్వచ్ఛందంగా, కావాలనే ఒక ఒంటరి శక్తిగా మారుతోందని వ్యాఖ్యానించారు. ఇక్కడ అమెరికా విషయంలో రాడికల్ రీపొజిషనింగ్ అనే పదం ఉపయోగించారు. రాడికల్ రీపొజిషనింగ్ అంటే ఏదైనా సంస్థ లేదా దేశం తన పాత ఇమేజ్, వ్యూహాలను పూర్తిగా మార్చేసి కొత్త విధానాన్ని ఎంచుకోవడం. ఇక్కడ అమెరికా విషయంలో తన పాత విదేశాంగ విధానాలను, వ్యూహాల్ని పూర్తిగా మార్చుకుంటోందని జైశంకర్ స్పష్టం చేశారు. ఇది పరిస్థితుల వల్లే వచ్చిన మార్పు కాదని, విధానపరంగా తీసుకున్న నిర్ణయం అని చెప్పుకొచ్చారు. ప్రతి విషయంలోనూ తానే ప్రపంచానికి పెద్దన్నలా ఉంటూ అందరికీ సాయం చేసే పాత పద్ధతిని పక్కనబెట్టి తన ప్రయోజనాలే ముఖ్యమనే ధోరణివైపు అమెరికా మారిందనే అర్థం వచ్చేలా జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

ఇక రెండో అంశం చైనా గురించి. చైనా తనను తాను అంతర్జాతీయంగా ఒక ప్రత్యేకమైన, విశిష్టమైన శక్తిగా భావిస్తోందని జైశంకర్ వ్యాఖ్యానించారు. చైనా ఎదుగుదల అంతర్జాతీయ వ్యవస్థను మరింత ప్రభావితం చేస్తోందన్నారు. చైనా ఆర్థిక, రాజకీయ సామర్థ్యాలు కూడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ఈ క్రమంలోనే అమెరికా- చైనా మధ్య ప్రస్తుతం తీవ్రమైన పోటీ నెలకొందని జైశంకర్ పేర్కొన్నారు. అయితే ప్రపంచంలో పోటీ కేవలం రెండు అగ్రదేశాలకే పరిమితం కాలేదని, ఈ కారణంగానే ప్రతి దేశం తమ వద్ద ఉన్న శక్తులు లేదా అవకాశాల్ని ఆయుధంగా మలుచుకునే ప్రమాదకర పరిస్థితులకు దారితీసిందని హెచ్చరించారు. ఇలా దీనిని ఇతరులపై ఒత్తిడి తెచ్చేందుకు ఉపయోగించుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు దేశాల మధ్య పరస్పర ప్రయోజనాల కోసం సంబంధాలు కొనసాగుతున్నా, మరోవైపు అవసరమైన చోట తమ బలాలనే అస్త్రాలు ప్రయోగిస్తున్నాయని జైశంకర్ తెలిపారు.

అభివృద్ధి చెందుతున్న దేశాలకు కొత్త అవకాశాలు

ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ స్వప్రయోజనాల కోసం పలు ప్రాంతీయ కూటములను ఆశ్రయిస్తున్నాయని జైశంకర్ తెలిపారు. పెద్ద పెద్ద దేశాల వ్యవస్థల కంటే నిర్దిష్ట ప్రయోజనాల కోసం ఏర్పడుతున్న చిన్న సమూహాలే కీలకంగా మారుతున్నాయని జైశంకర్ ఉదాహరణలతో వివరించారు. ఇందులో భారత్ భాగస్వామ్యంతో రూపుదిద్దుకున్న క్వాడ్ (ఖఖూూణ), ఇండియా మిడిల్ ఈస్ట్- యూరప్ ఎకనామిక్ కారిడార్ (xవీజుజుజ), ఇంటర్నేషనల్ నార్త్ సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్ (xచీూజ), ఇంటర్నేషనల్ సోలార్ అలియన్స్ (xూూ), బ్రిక్స్ వంటి వేదికలు నిదర్శనం అని జైశంకర్ చెప్పారు. ఈ కూటముల ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలు పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకోవడమే కాకుండా, అవసరానికి అనుగుణంగా అమెరికా-చైనాతో కూడా సంబంధాలు కొనసాగిస్తున్నాయని వివరించారు. భవిష్యత్తులో దేశాలు ఒకే దానిపై కాకుండా, తమ ప్రయోజనాలకు అనుగుణంగా అనేక దేశాలతో సంబంధాలు కొనసాగించాల్సి ఉంటుందని చెప్పారు.

అమెరికా- చైనా పోటీపై జైశంకర్ విశ్లేషణ

రెండు అగ్రదేశాలు అమెరికా- చైనా మధ్య తీవ్ర పోటీ నేపథ్యంలో ప్రపంచ దేశాలు బ్యాలెన్సింగ్ వ్యూహాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని జైశంకర్ సూచించారు. అమెరికా- చైనా పోటీని ఆయన గోల్డిలాక్స్ సినారియోతో పోల్చారు. ఇక్కడ రెండు దేశాల మధ్య పరిస్థితి మరీ తీవ్రంగా ఉండకూడదని, అదే సమయంలో మరీ సన్నిహితంగా కూడా ఉండకూడదని, రెండింటి మధ్య సమతుల్యత అవసరం అని వివరించారు.

మాటలకే పరిమితం కాలేదు- నేరుగా రంగంలోకి దిగాం

రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధానికి ముగింపు పలికేందుకు భారత్ తన దౌత్య వ్యూహాన్ని మరింత వేగవంతం చేసిందని జైశంకర్ తెలిపారు. ఇన్ని రోజులు కేవలం చర్చలు, దౌత్యం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించే స్థితి నుంచి ఇప్పుడు ఇరు దేశాలతో నేరుగా చర్చలు జరిపే స్థాయికి భారత్ చేరుకుందని ఆయన తెలిపారు. సంక్షోభాన్ని ముగించడమే తమ ప్రథమ లక్ష్యమని, అందుకోసం తీవ్రంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. గత కొంత కాలంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా యుద్ధాన్ని ముగించాల్సిన సమయం వచ్చిందని బహిరంగంగా చెబుతూనే ఉన్నారు.

మన ఆరోగ్యం... మన బాధ్యత...!

ఆరోగ్యం

ఆరోగ్యమే మహాభాగ్యం



ఆరోగ్యంగా ఉంటేనే ఆనందంగా ఉండగలం...

రోజూ ఆరోగ్యంగా ఉండాలంటే ఈ 7 అలవాట్లు పాటించండి

ఆరోగ్యం అనేది మన జీవితానికి మూలాధారం. చిన్నచిన్న అలవాట్లతో పెద్ద మార్పు తీసుకురాగలం. కింది 7 అలవాట్లను రోజువారీ జీవితంలో అవలంబిస్తే... మీరు ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉండవచ్చు.

1 తగినంత నీరు తాగండి



రోజంతా శరీరానికి అవసరమైన ద్రవాలు అందేలా చూసుకోండి. రోజుకు కనీసం 8–10 గ్లాసుల నీరు తాగడం మంచిది.

2 సమతుల్య ఆహారం తీసుకోండి



కూరగాయలు, పండ్లు, పప్పులు, ధాన్యాలు, పాల ఉత్పత్తులు పంటి పోషకాహారాన్ని ఆహారంలో చేర్చండి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండండి.

3 రోజూ వ్యాయామం చేయండి



నడక, యోగా లేదా మీకు అనుకూలమైన శారీరక వ్యాయామానికి సమయం కేటాయించండి. ఇది బరువు నియంత్రణకు, హృదయానికి, ఎముకలకు మంచిది.

4 తగినంత నిద్రపోండి



శరీరం, మెదడు విశ్రాంతి పొందడానికి క్రమబద్ధమైన నిద్ర అవసరం. రోజుకు 7–8 గంటల నిద్ర తప్పనిసరి.

5 ఉప్పు, చక్కెరను పరిమితం చేయండి



అధికంగా తీసుకోవడం రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులకు దారితీయవచ్చు. ఆహారంలో సహజ రుచిని ఎంచుకోండి.

6 పొగాకు, మద్యపానానికి దూరంగా ఉండండి.



ఇవి కేవలం అలవాట్లు కాదు, ప్రాణాంతక వ్యసనాలు. ఇవి క్యాన్సర్, ఊపిరితిత్తుల సమస్యలు, గుండె వ్యాధులకు కారణం అవుతాయి.

7 క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోండి



ముఖ్యంగా వయస్సు, కుటుంబ చరిత్రను బట్టి అవసరమైన పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనారోగ్యాన్ని ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందవచ్చు.

ఆరోగ్య చిట్కా

"ఆరోగ్యకరమైన ఆహారం + రోజువారీ శారీరక చలనం + మంచి నిద్ర + ఒత్తిడి నియంత్రణ = ఆరోగ్యకరమైన జీవితం"

ఆరోగ్యకరమైన ఆహారంలో ఇవి తప్పనిసరి



- పచ్చి కూరగాయలు
- పండ్లు
- పప్పులు
- ధాన్యాలు
- పాలు & పాల ఉత్పత్తులు
- గింజలు

ఆరోగ్యంగా ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలు

- శరీరానికి శక్తి పెరుగుతుంది
- రోగనిరోధక శక్తి బలపడుతుంది
- మానసిక ప్రశాంతత లభిస్తుంది
- జీవితకాలం పెరుగుతుంది
- ఉద్యోగ, కుటుంబ జీవితాల్లో సంతోషం పెరుగుతుంది



గుర్తుంచుకోండి... మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంది!

బిజినెస్

ఐఏఎఫ్ కాంట్రాక్టు లభిస్తే.. భారత్‌లో విమానాల తయారీ!



వాషింగ్టన్/దిల్లీ: భారత వాయుసేన (ఐఏఎఫ్) కోసం మధ్య తరహా రవాణా విమానాల సరఫరా కాంట్రాక్ట్ కనుక తమకు లభిస్తే, భారత్‌లో తమ ఉత్పత్తి సామర్థ్యాలను మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని అమెరికా దిగ్గజ సంస్థ లాక్‌హీడ్ మార్టిన్ సీనియర్ అధికారి వెల్లడించారు. 60 మధ్య తరహా రవాణా విమానాలు కొనుగోలు చేసేందుకు 10.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.లక్ష కోట్ల) అంచనా వ్యయంతో, మనదేశం ఆగస్టులో టెండర్ జారీ చేసింది. ఈ కాంట్రాక్ట్ కోసం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), మహీంద్రా గ్రూప్, అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), రిలయన్స్ డిఫెన్స్ సంస్థలు పోటీలో ఉన్నాయి. ఈ భారతీయ సంస్థలు అంతర్జాతీయ విమాన తయారీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుని, ఈ ప్రాజెక్టు బిడ్డింగ్‌లో పాల్గొంటున్నాయి.

హైదరాబాద్‌లో ఇప్పటికే

లాక్‌హీడ్ మార్టిన్‌కు టీఏఎస్ఎల్‌తో దీర్ఘకాలంగా భాగస్వామ్యం ఉంది. హైదరాబాద్-వడోదరలో టాటాతో కలిసి సంయుక్తంగా నెలకొల్పిన టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ (టీఎల్ఎంఏఎల్) ప్లాంట్లున్నాయి. సీ-130జే విమానాలకు వివిధ విడిభాగాలు, వెనుక భాగంలోని నిర్మాణాలను తయారు చేస్తున్నట్లు లాక్‌హీడ్ మార్టిన్ గ్లోబల్ బిజినెస్ డెవలప్‌మెంట్ - స్ట్రాటజీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాన్ టెన్నీ తెలిపారు. కొత్త ఆర్డర్ లభిస్తే ఈ సామర్థ్యాన్ని మరింత విస్తరించనున్నట్లు ఆయన చెప్పారు. విమానాల తయారీతో పాటు ఇతర కార్యకలాపాలు కూడా భారత్‌లోనే జరిగేలా చూస్తామన్నారు. లాక్‌హీడ్ మార్టిన్ ప్రతిపాదన ప్రకారం మొత్తం 60 విమానాల్లో 12 విమానాలను పూర్తిగా సిద్ధం చేసిన స్థితిలో భారత్‌కు అందిస్తారు. మిగిలిన 48 విమానాలను భారత్‌లోనే తయారు చేస్తామని కంపెనీ ప్రతిపాదించింది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఇప్పటికే వినియోగిస్తున్న 12 సీ-130జే విమానాలను కూడా అధునాతన కాన్ఫిగరేషన్‌కు అప్‌గ్రేడ్ చేస్తామని లాక్‌హీడ్ మార్టిన్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమలైతే, ఐఏఎఫ్ వద్ద ఒకే రకమైన అధునాతన కాన్ఫిగరేషన్ కలిగిన మొత్తం 72 విమానాలుంటాయి. ప్రస్తుతం ఐఏఎఫ్ వినియోగిస్తున్న సీ-130జే విమానాలు ఇప్పటివరకు 58,000కు పైగా విమాన ప్రయాణ గంటలను పూర్తి చేశాయి. లద్దాఖ్‌లోని అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో ఇవి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. నేపాల్‌లో వరదల సమయంలో సహాయక చర్యలు, 2023లో సూడాన్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తరలించే ఆపరేషన్ వంటి కీలక మిషన్లలో ఈ విమానాలను ఉపయోగించారు.

ప్రాపర్టీ రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ మధ్య తేడా ఏంటి?



రిజిస్ట్రేషన్

మీరు ఏదైనా స్థిరాస్తి కొన్నప్పుడు ప్రభుత్వం వద్ద నమోదు ద్వారా చట్టబద్ధంగా దాని యాజమాన్య హక్కుల్ని బదిలీ చేసుకోవడం అవసరం. కేవలం కొన్నదేగాక, మీకు వారసత్వంగా వచ్చినా, బహుమతి రూపం లో అందినా, వీలునామా ద్వారా సంక్రమించినా ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ప్రాపర్టీ యజమాని బదిలీ చేస్తే తప్ప.. మీరు సదరు ఆస్తికి యజమాని కాలేరుమరి. ఇక ఆస్తి విలువ రూ.100 దాటితే భారతీయ రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 17 కింద ఆ ఆస్తిని రిజిస్టర్ చేయించాల్సిందే. సేల్ డీడ్, వీలునామా, గిఫ్ట్ డీడ్ తదితర యాజమాన్య ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్ ఇతర గుర్తింపు పత్రాలు ఇందుకు అవసరమవుతాయి. స్థిరాస్తి ఎక్కడ ఉన్నదో ఆ పరిధిలోని సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సాక్షుల సమక్షంలో కొన్నవారు, అమ్మినవారు సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. అయితే పేర్కొన్న రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీలను చెల్లించాల్సి ఉంటుంది.

మ్యూటేషన్

ప్రభుత్వ భూ రెవిన్యూ రికార్డుల్లో ఆస్తి యజమాని పేరును మార్చడమే మ్యూటేషన్ ప్రక్రియ. ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ పూర్తయ్యాకే మ్యూటేషన్‌కు వీలుంటుంది. సంబంధిత పత్రాలను సమర్పించి, మ్యూటేషన్ ఫీజు చెల్లిస్తే స్థానిక మున్సిపల్ కార్యాలయాల్లో పని జరుగుతుంది. ఆస్తి పన్ను, నీరు, విద్యుత్తు, గ్యాస్ కనెక్షన్ల కోసం కూడా ఇది తప్పనిసరి. తర్వాత రోజుల్లో కొన్న ఆస్తిని తిరిగి అమ్ముకోవాలన్నా ఈ మ్యూటేషన్ ముఖ్యం. పైగా ఈ ప్రాపర్టీ రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌లు ఆస్తుల తగాదాలనూ నివారించగలవు.

ఈఎంఐలు భారం కానున్నాయా? ఆర్‌బీఐ వడ్డీ రేట్లు పెంచే ఛాన్స్

ముంబయి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలకమైన రెపోరేటును పెంచే అవకాశం ఉంది. అక్టోబర్ నెల ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోరేటును 0.25 శాతం మేర పెంచుతూ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు, బ్యాంకర్లు అభిప్రాయపడుతున్నారు. పశ్చిమాసియాలో అనిశ్చిత పరిస్థితుల కారణంగా నెలకొన్న ద్రవ్యోల్బణ భయాలకు తోడు, ఇతర కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు సవరిస్తుండడమే ఇందుక్కారణమని పేర్కొంటున్నారు.

ఒకవేళ విశ్లేషకులు ఊహించినట్లే ఆర్‌బీఐ వడ్డీ రేట్లు సవరిస్తే.. రెపోరేటుతో ముడిపడి ఉన్న గృహ, వాహన రుణాలు ప్రియం కానున్నాయి. ఆ మేర నెలవారీ చెల్లించే ఈఎంఐలు భారం కానున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచింది. దీంతో అప్పట్లో రెపోరేటు 6.50 శాతానికి చేరింది. ఆపై 2023-24లో స్థిరంగా కొనసాగించింది. 2025లో వరుసగా వడ్డీ రేట్లు తగ్గించిన ఆర్‌బీఐ.. పశ్చిమాసియా పరిస్థితుల నేపథ్యంలో స్థిరంగా కొనసాగిస్తోంది. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా ఉంది. అక్టోబర్ నెలకు సంబంధించిన ఎంపీసీ భేటీలో రెపోరేటుపై నిర్ణయం తీసుకోనుంది. బుధవారం నిర్ణయం వెలువడనుంది.

పాత ప్రీమియం కార్లను కొనేద్దాం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులతో సమానంగా ఆర్‌బీఐ కూడా వడ్డీ రేట్లు సవరించవచ్చని పలువురు ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వృద్ధి ఊపందుకోవడం వంటివి ఇందుకు కారణాలని చెబుతున్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు తలెత్తడం వల్ల ఇంధనం, కమొడిటీ ధరలు పెరుగుతున్నాయని, దీనివల్ల మరోసారి రెపోరేటు పెంచొచ్చని అభిప్రాయపడుతున్నారు. పీటీఐ నిర్వహించిన పోల్‌లో మెజారిటీ ఆర్థిక నిపుణులు ఇదే తరహా అభిప్రాయం వ్యక్తంచేశారు. అయితే, మరోసారి స్టేటస్ కో కొనసాగించే అవకాశమూ లేకపోలేదని మరో ఆర్థికవేత్త అభిప్రాయపడ్డారు. డిమాండ్ ఆధారిత ద్రవ్యోల్బణం ఇంకా ఊపందుకోని కారణంగా మరికొంతకాలం వేచి చూసే ధోరణిని ఆర్‌బీఐ అవలంబించొచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు.



అట్టహాసంగా ముగిసిన ఏషియన్ గేమ్స్

నగోయా (జపాన్) : రెండు వారాల పాటు వేలాది మంది ఆసియా క్రీడాకారుల హోరాహోరీ పోరాటాలకు వేదికగా నిలిచిన 20వ ఆసియా గేమ్స్‌కు తెరపడింది. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం 90 నిమిషాల పాటు సాగిన ముగింపు వేడుకలు కనువిందు చేశాయి. ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ఓసీఏ) అధ్యక్షుడు షేక్ జోఆన్ బిన్ హమద్ అల్ థానీ క్రీడలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఓసీఏ పతాకాన్ని 2030 ఎడిషన్‌కు ఆతిథ్యం ఇచ్చే ఖతార్‌లోని దోహా నగర ప్రతినిధులకు అధికారికంగా అందజేశారు. ఖతార్ హైజంప్ దిగ్గజం ముతాజ్ బార్షిమ్ నుంచి ఈక్వెస్ట్రియన్ రైడర్ జాసిమ్ అల్ కువారీ ఆసియాడ్ పతాకాన్ని స్వీకరించాడు.ముగింపు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచిన అథ్లెట్ల పరేడ్‌లో భారత ట్రాప్ షూటర్ నీరూ ధండా త్రివర్ణ పతాకాన్ని చేతిలో పట్టుకుని ముందు నడిచింది. తెలుపు, నీలం రంగు దుస్తులు ధరించిన సుమారు 30 మంది భారత అథ్లెట్లు, అధికారులు ఈ మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్నారు. 'వన్ ఆసియా' అనే ఇతివృత్తంతో రూపొందించిన వేదికపై జపాన్ సాంప్రదాయ 'బోన్-ఒడోరి' నృత్యాలు, 'మత్సుకెన్ సాంబా2' ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



ఆరంభ లోపాలను దాటి

ఈసారి ఆసియా క్రీడల నిర్వహణలో జపాన్ భిన్నమైన వ్యూహాన్ని అనుసరించింది. భారీ ఖర్చులతో ప్రత్యేకంగా అథ్లెట్స్ విలేజ్‌లు, కొత్త స్టేడియంలు నిర్మించకుండా.. అందుబాటులో ఉన్న వేదికలు, తాత్కాలిక నిర్మాణాలతో తక్కువ ఖర్చుతో క్రీడలను నిర్వహించింది. ఆరంభంలో హోటల్ వసతి సమస్యలు, రవాణా ఆలస్యం, అక్రిడిటేషన్ గందరగోళం ఎదురైనప్పటికీ.. నిర్వాహకులు త్వరగానే లోపాలను సరిదిద్ది పోటీలను విజయవంతంగా ముగించారు. 45 దేశాల నుంచి దాదాపు 11 వేల మంది అథ్లెట్లు పాల్గొన్న పోటీల్లో 54 ప్రపంచ రికార్డులు, 89 ఆసియా రికార్డులు బ్రేక్ అవడంతో ఈ ఆసియాడ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది.

డివిలియర్స్ విధ్వంసం.. విండీస్‌పై సౌతాఫ్రికా భారీ స్కోరు



వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్) 2026 టోర్నీలో భాగంగా వెస్టిండీస్ చాంపియన్స్‌తో జరుగుతున్న టీ20 మ్యాచ్‌లో సౌతాఫ్రికా చాంపియన్స్ భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ ఏబీ డివిలియర్స్ (39 బంతుల్లో 70; 4 ఫోర్లు, 5 సిక్సర్లు), ఓపెనర్ రిచర్డ్ లెవీ (39 బంతుల్లో 87; 5 ఫోర్లు, 8 సిక్సర్లు) భారీ అర్ధశతకాలతో విధ్వంసం సృష్టించారు. వీరిద్దరి బీభత్సం ధాటికి సౌతాఫ్రికా చాంపియన్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. చివర్లో సారెల్ ఎర్వీ (23) ధాటిగా ఆడాడు. వెస్టిండీస్ చాంపియన్స్ బౌలర్లలో డేవ్ మొహమ్మద్ రెండు వికెట్లు తీయగా, ఫిడెల్ ఎడ్వర్డ్స్, రెయాడ్ ఎమ్రిట్, డ్వేన్ బ్రావో తలా ఒక వికెట్ తీశారు. ముందుగా రిచర్డ్ లెవీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఫోర్లు, సిక్సర్లతో మైదానం హోరెత్తించాడు. అగ్నికి వాయువు తోడైనట్లు లెవీకి డివిలియర్స్ జత కలవడంతో స్కోరుబోర్డు ఉరకలెత్తింది. ఈ ఇద్దరు రెండో వికెట్‌కు 42 బంతుల్లోనే 104 పరుగులు సాధించి సౌతాఫ్రికా భారీ స్కోరుకు బాటలు వేశారు. లెవీ ఔటైనప్పటికీ, సారెల్ ఎర్వీతో కలిసి డివిలియర్స్ జట్టు స్కోరును 200 దాటించాడు.

స్పోర్ట్స్

ముకేష్ వికెట్ల వేట.. 30వసారి ఇరానీ కప్ విజేతగా రెస్టాఫ్ ఇండియా



భారత వన్డే జట్టులో చోటు కోల్పోయిన రిషభ్ పంత్ దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటాడు. ఆటగాడిగా ధనాధన్ బ్యాటింగ్‌తో అలరించే పంత్ ఈసారి కెప్టెన్‌గా రెస్టాఫ్ ఇండియా(=వర్ ాట ×అఃఱు)కు టైటిల్ అందించాడు. ఇరానీ కప్ (×తీుఅఱ జబజూ) ఫైనల్లో ముకేశ్ కుమార్(2-84, 33-6) ఎనిమిది వికెట్లతో విరచుకుపడగా.. పంత్ సారథ్యంలోని రెస్టాఫ్ ఇండియా 167 పరుగుల తేడాతో జమ్ము కశ్మీర్‌ను ఓడించింది. దాంతో రికార్డు స్థాయిలో ముప్పయ్యోసారి ట్రోఫీని ముద్దాడింది. ఇరానీ ట్రోఫీ 2026-27 ఫైనల్లో రెస్టాఫ్ ఇండియా అదరగొట్టింది. రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ సనత్ సాంగ్వన్(55) అర్ధ శతకంతో శుభారంభమివ్వగా.. స్మరణ్ రవిచంద్రన్(135) సూపర్ సెంచరీతో కదం తొక్కాడు. అనంతరం 279 పరుగుల ఛేదనలో జమ్ము కశ్మీర్ బ్యాటర్లను పేసర్ ముకేశ్ కుమార్ (2-84, 33-6) వణికించాడు. బుల్లెట్ బంతులతో నిప్పులు చెరిగిన ముకేశ్ ఏకంగా ఆరుగుని ఔట్ చేసి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బతీశాడు. దాంతో.. జమ్ము 111 రన్స్‌కే కుప్పకూలింది. ఆల్‌రౌండ్ షోతో కనబరిచి 167 పరుగుల తేడాతో గెలుపొందిన రెస్టాఫ్ ఇండియా 30వ సారి ఈ టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచింది. తద్వారా జట్టుకు ట్రోఫీ కట్టబెట్టిన రెండో వికెట్ కీపర్‌గా పంత్ గుర్తింపు సాధించాడు. ఖతర్నాక్ శతకంతో విజయంలో భాగమైన స్మరణ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.



విశ్వక్‌సేన్ ‘కల్ట్’ విడుదల అప్పుడే

విశ్వక్‌సేన్ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘కల్ట్’. తారక్ సినిమా పతాకంపై సందీప్ కాకరాల భారీ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ని పూర్తి చేసుకున్నది. హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో నిర్మించిన భారీసెట్‌లో వందలాది మోడల్స్‌తో 40-50 రోజుల పాటు జరిగిన కీలక సన్నివేశాల చిత్రీకరణతో షూటింగ్ పూర్తయిందని మేకర్స్ తెలిపారు. భారతీయ భాషలతోపాటు విదేశీ భాషల్లో కూడా ఈ సినిమాను విడుదల చేస్తున్నామని, ఈనెల 30న ప్రపంచవ్యాప్తంగా ‘కల్ట్’ విడుదల కానున్నదని మేకర్స్ చెప్పారు. గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మురళీశర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, తారక్ పొన్నప్ప, ప్రజ్ఞ ఇతరపాత్రధారులు. ఈచిత్రానికి మాటలు: తరుణ్‌భాస్కర్, సౌండ్ డిజైన్: ‘యానిమల్’ఫేం సచిన్.


ఓ వైపు శాతం.. మరో వైపు రౌద్రం

ప్రస్తుతం సాయిపల్లవికి మహర్దశ నడుస్తున్నది. ఒక కథానాయికగా దేశవ్యాప్తంగా తిరుగులేని గుర్తింపు రావడం అరుదైన విషయం. అన్ని భాషలకు చెందిన ప్రేక్షకులూ తమ హీరోయిన్‌గా ఓన్ చేసుకోవడం ఈ మధ్య సాయిపల్లవి విషయంలోనే జరిగిందని చెప్పక తప్పదు. వచ్చే నెలలో రెండు వారాల తేడాతో ఆమె సినిమాలు రాబోతున్నాయి. వాటిలో మొదటిది నితీష్ తివారీ ‘రామాయణ: పార్ట్ 1’. ఈ పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యంలో సాయిపల్లవి సీతామహాసాధ్విగా కనిపించనున్నారు. సరిగ్గా ఈ సినిమా విడుదలైన రెండు వారాలకు, అంటే.. నవంబర్ 20న ధనుష్ హీరోగా రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందుతున్న ‘ఓం: చాప్టర్ 1’ విడుదల కానున్నది. ఇందులో సాయిపల్లవిది కీలకమైన పాత్ర. యాక్షన్, ఎమోషన్స్‌తో ఆమె పాత్ర సాగుతుందని సమాచారం. రెండు వారాల గ్యాప్‌తో రెండు పొంతన లేని పాత్రల ద్వారా ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని సాయిపల్లవి పంచనున్నదని సినీవర్గాలు అంటున్నాయి. ఈ ప్రయత్నాలు రెండూ ఫలిస్తే.. సాయిపల్లవి క్రేజ్ దేశవ్యాప్తంగా మరింత పెరగడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



మట్టితో మమేకమైన కూలీ కథ

హీరో శర్వానంద్ నటిస్తున్న ఇంటెన్స్ పీరియడ్ యాక్షన్ డ్రామా ‘భోగి’. సంపత్‌నంది దర్శకుడు. కేకే రాధామోహన్ నిర్మాత. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా ఈసినిమా టీజర్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. గ్రామీణ జానపద శైలిలో సాగే వాయిస్ ఓవర్‌తో టీజర్ మొదలైంది. బొగ్గుల గుట్ట అనే గ్రామాన్ని అక్కడి నాగరికతనూ, పగలు, ప్రతీకారాలు, భక్తి, మూఢ విశ్వాసాల నేపథ్యంలో టీజర్ సాగింది. శర్వా రఫ్ అండ్ రగ్డ్ లుక్‌లో మట్టితో మమేకమైన ఓ సాధారణ కూలీగా కనిపించారు. అనుపమ పరమేశ్వరన్ పాత్ర కూడా సీరియస్ మోడ్‌లో ఆసక్తిని రేకెత్తించేలా ఉన్నది. 1960ల ప్రారంభంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని ఓ కల్పిత గ్రామం నేపథ్యంలో సాగే ఈ కథను దర్శకుడు సంపత్‌నంది ఎంతో సహజంగా, నేటివిటితో తెరకెక్కిస్తునట్టు టీజర్ చెబుతున్నది. రా, ఇంటెన్స్, రూటెడ్ ప్రపంచాన్ని టీజర్ ఆవిష్కరించింది. డింపుల్ హయాతీ మరో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కిశోర్‌కుమార్ అరోకియా, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, నిర్మాణం: శ్రీసత్యసాయి ఆర్ట్స్.





చకోర.. ఓ అమ్మ చెప్పిన కథ

శ్రవణ్, మలైకా టి వాసుపల్ జంటగా నటించిన చిత్రం ‘చకోర -- లూనార్ లవ్ బర్డ్’. మంగా శ్రీనివాస్ దర్శకుడు. చింతాడ హేమారావు నిర్మాత. అక్టోబర్ 9న సినిమా థియేట్రికల్ రిలీజ్ కానున్నది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ వైజాగ్‌లో జరిగింది. ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ‘ఇదొక అమ్మ చెప్పిన ప్రేమకథ. కేవలం వర్షపునీళ్లతోనే దాహం తీర్చుకునే విశిష్టమైన పక్షి చకోర. ఆ పక్షిలాగే మనం కూడా స్వచ్ఛమైన పేమ కోసమే వేచి చూడాలని, అలాగే.. చకోర పక్షికి జాబిల్లిని చేరాలని కోరిక. దాని కోసం అలుపెరగకుండా ప్రయాణిస్తుంది. ఆ ప్రయత్నంలోనే మరణిస్తుంది. మనం కూడా చకోర పక్షిలా లక్ష్యాన్ని చేరుకునేందుకు అవిశ్రాంతంగా శ్రమించాలని ఈ సినిమా ద్వారా చెబుతున్నాం’ అని దర్శకుడు మంగా శ్రీనివాస్ అన్నారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల హీరోహీరోయిన్లు శ్రవణ్, మలైకా ఆనందం వెలిబుచ్చారు. ఇంకా చిత్రబృందం అంతా మాట్లాడారు.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999